సిఎం రేవంత్‌రెడ్డితో జహీరాబాద్ ఎంపి సమావేశం

సిఎం రేవంత్‌రెడ్డితో ఎంపి సురేష్‌కుమార్ షెట్కార్

నారాయణఖేడ్, మే 20 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ షెట్కార్ మర్యాద పూర్వకంగా కలిసి పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలు తదితర విషయాలపై సిఎంకి ఎంపి సురేష్ కుమార్ షెట్కార్ వివరించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపినట్టు ఎంపి పేర్కొన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా నరేందర్‌గౌడ్

పాపన్నపేట, మే 20, ప్రభాతవార్త : మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా నరేందర్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ కాంగ్రెస్ అధిష్టానం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. తన నియామకానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, డీసీసీ అధ్యక్షుడు హన్మంత్‌గౌడ్‌లకు నరేందర్‌గౌడ్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా, కాంగ్రెస్‌పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే రోహిత్ రావు నేతృత్వంలో మండల ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతానని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ పార్టీ బలాన్ని మరింత పెంచుతానని నరేందర్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

నరేందర్‌గౌడ్

ట్రాఫిక్ సిబ్బందికి కిట్లు అందజేస్తున్న జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్

ప్రమాదాల నివారణలో ట్రాఫిక్ పోలీసులది కీలకపాత్ర

సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి మున్సిపాలిటీ, మే 20, ప్రభాతవార్త : సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీస్ సిబ్బందిని దృష్టిలో ఉంచుకొని ఎండలు, వర్షాల నుంచి రక్షణ కల్పించేందుకు, విధి నిర్వహణలో ఉపయోగపడే మొత్తం 9 వస్తువులతో కూడిన ప్రత్యేక కిట్లను జిల్లా ఎస్పీ పరితోష్‌పంకజ్ బుధవారం సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజల రాకపోకలు సజావుగా సాగేందుకు ఎండలు, వర్షాలను లెక్కచేయకుండా విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది ఆరోగ్యం, భద్రత మా బాధ్యత అని, ట్రాఫిక్ సిబ్బందికి అవసరమైన రక్షణ సామగ్రిని అందించేందుకు ఈ కిట్లను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్ సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణలో కీలకపాత్ర పోషిస్తున్నారని, ప్రజల సురక్షిత ప్రయాణం కోసం సంగారెడ్డి ట్రాఫిక్ పోలీసులు నిరంతరం కృషిచేస్తున్నారని తెలిపారు. విధినిర్వహణలో సిబ్బంది ఆరోగ్యాన్ని పరిరక్షిస్తూ, మరింత సమర్థవంతంగా సేవలు అందించేందుకు ఇటువంటి చర్యలు ఉపయోగపడతాయని జిల్లా ఎస్పీ తెలిపారు. ట్రాఫిక్ సిబ్బందికి అందజేసిన కిట్లలో క్యాప్, కూలింగ్ గ్లాసెస్, రిఫ్లెక్టివ్ జాకెట్లు-2, రెయిన్ కోట్లు, వాటర్‌బాటిల్, లైటింగ్ బ్యాటన్, షోల్డర్ లైట్‌తో కూడిన బ్యాగ్ తదితర సామగ్రి ఉన్నాయి. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ రెడ్డి, ఇన్స్పెక్టర్లు రమేష్, కిరణ్ కుమార్ ప్రవీణ్ రెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి పాలిసెట్ కౌన్సిలింగ్

సంగారెడ్డి మున్సిపాలిటీ, మే 20, ప్రభాతవార్త : పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశానికి నిర్వహించిన పాలిసెట్ 2026 వెబ్ కౌన్సిలింగ్ ప్రక్రియ ఈనెల 27 నుంచి ప్రారంభమవుతుందని సంగారెడ్డి కళాశాల ప్రిన్సిపల్ జానకిదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఈనెల 27వ తేదీ నుంచి 31 వరకు ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవాలని చెప్పారు. ఈనెల 29 నుంచి జూన్ 3వ తేదీ వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ వెబ్ ఆప్షన్లు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. జూన్ 6న సీట్లు కేటాయింపు ఉంటుందని విద్యార్థులు ముఖ్యమైన తేదీలను అనుసరించి కౌన్సిలింగ్ ద్వారానే కళాశాలలో ప్రవేశం పొందాలనిప్రిన్సిపల్ జానకిదేవి సూచించారు. పాలిటెక్నిక్‌లో చేరిన విద్యార్థినీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే ఉపేక్షించం : తహసీల్దార్

అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

అమీన్‌పూర్, మే 20 ప్రభాతవార్త: ప్రభుత్వభూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వై.వెంకటేష్ హెచ్చరించారు. అమీన్‌పూర్ మండల రెవెన్యూ పరిధిలోని 6:30 సర్వే నంబర్లలో అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు అందడంతో తహసీల్దార్ వెంకటేష్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ సంగీత పర్యవేక్షణలో జేసీబీ సహాయంతో అక్రమ నిర్మాణాలను తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను పరిరక్షిం చేందుకు రెవెన్యూ యంత్రాంగం నిరంతరం పనిచేస్తోందన్నారు. కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టడం సహించబోమని స్పష్టం చేశారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంగీత, జీపీవోలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఎర్రరాయి తవ్వకాలు

-పట్టించుకోని అధికారులు

మొగుడంపల్లి, మే 20, ప్రభాతవార్త: మండలంలో అక్రమంగా ఎర్ర రాయి తవ్వకాలు, మట్టి తరలింపు యథేశ్చగా కొనసాగుతున్నా అడిగే నాథులు కరువయ్యారు. మండలంలో సహజ వనరుల దోపిడీ కొనసాగుతోందని, ప్రభుత్వ ఖజానాకు గండి పడుతున్నా పట్టించుకునే అధికారులు కరువయ్యారన్న ఆరోపణలు వివనస్తున్నాయి. మండలంలోని పర్వతాపూర్, మిర్జంపల్లి, జాడిమల్కాపూర్, మన్నాపూర్, ఉప్పర్‌పల్లి, పడియాల్ తండా, గోపన్‌పల్లి, ఖాంజమాల్‌పూర్, అసద్‌గంజ్, ఇప్పెపల్లి, గౌసాబాద్ తదితర గ్రామాల్లో అక్రమంగా పనులు కొనసాగుతున్నా అధికారులకు పట్టింపు లేకుండా పోవడం విడ్డూరంగా ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమంగా ఎర్ర రాయిని, మట్టిని తవ్వేసి తరలించాక ఏర్పడిన గుంతలను మూయకపోతుండంతో వర్షాకాలంలో వానలు పడుతున్న సమయాల్లో ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్న సంఘటన అనేకం అని చెప్పడం అతిశయోక్తికాదు. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న అక్రమార్కుల ఆటలు కట్టించేందుకు జిల్లా కలెక్టర్ స్పందించాలని మండల ప్రజలు వినతి చేస్తున్నారు.

ఎర్ర రాయిని అక్రమంగా వాహనంలో తరలిస్తున్న దృశ్యం

ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచాలి

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి మున్సిపాలిటీ, మే 20, ప్రభాతవార్త : ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచి ఎక్కువ మందికి ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుండి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి దాన కిషోర్, సెర్ప్ సీఈవో దివ్య అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో ఎన్ఆర్ఇజీఎస్, మహిళా స్వయం సహాయక సంఘాలు, చేయూత పథకం, నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం(ఎన్ఎఫ్‌బీఎస్) తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు వేగవంతం కావడానికి అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొత్త జాబ్ కార్డులను మంజూరు చేయడంతోపాటు ఉపాధి హామీ కూలీలు పూర్తిస్థాయిలో పని దినాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. కొత్త జాబ్ కార్డులు జారీ చేయడంపై దృష్టి సారించాలని సూచించారు. నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం, చేయూత పథకాల ప్రయోజనాలను అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దివ్యాంగులకు దేశవ్యాప్తంగా ఒకే విధమైన గుర్తింపును కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూడీఐడీ (యూనిక్ డిసేబిలిటీ ఐడెంటిటీ) కార్డులను అర్హులైన ప్రతి ఒక్కరూ పొందేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఉపాధి హామీ కూలీలు ఉదయం 7 గంటలలోపు తమకు కేటాయించిన పని ప్రదేశాలకు చేరుకుని విధులు నిర్వహించేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఉపాధి హామీ నిధులతో నిర్మిస్తున్న గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ భవనాలు, మహిళా సంఘాల భవనాలు, ప్రభుత్వ పాఠశాలల మరుగుదొడ్లు, కాంపౌండ్ వాల్స్ తదితర నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సబ్ కలెక్టర్ ఉమాహారతి, జడ్పీ సీఈవో జానకి రెడ్డి, డీఆర్డీఓ జ్యోతి, అడిషనల్ పీడీలు సూర్యారావు, బాల్‌రాజ్, ఎంపీడీవోలు, ఏపీఎంలు, తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఇతర అధికారులు

వ్యాపార సంస్థలు భద్రతా నియమాలను పాటించాలి

సీపీ రష్మీ పెరుమాళ్

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి: జ్యువెలరీ షాపుల యజమానులు, సిబ్బంది విధిగా భద్రతా ఏర్పాట్లను చేసుకోవాలని సీపీ రష్మీ పెరుమాళ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని జ్యువెలరీ షాపుల యజమానులు, వ్యాపార సంస్థల సిబ్బందితో సీపీ కార్యాలయంలో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి శాంతిభద్రతల పరిరక్షణ, జ్యువెలరీ షాపుల్లో తీసుకోవాల్సిన ముందస్తు భద్రతా చర్యలు పలు కీలక సూచనలు చేసి తెలంగాణ పబ్లిక్ సేఫ్టీ మెజర్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ యాక్టు 2013 అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి వ్యాపార సంస్థ చట్టం ప్రకారం భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. జ్యువెలరీ షాపుల ప్రధాన రహదారి, ప్రవేశ, ఎగ్జిట్, ద్వారాలు స్పష్టంగా కనిపించేలా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. కెమెరాల రికార్డింగ్ కనీసం 60 రోజుల బ్యాకప్ కలిగి ఉండాలన్నారు. సీసీ కెమెరాలకు సంబంధించిన డీవీఆర్ సెటప్ బయటి వ్యక్తులకు కనిపించేలా కాకుండా అత్యంత సురక్షితమైన రహస్య ప్రదేశంలో ఉంచాలన్నారు. ప్రతి జ్యువెలరీ షాప్ ముందు తప్పనిసరిగా సెక్యూరిటీ గార్డులను నియమించుకోవాలన్నారు. షాపుల వద్ద డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్, హ్యాండ్ హెల్డ్ మెటల్ డిటెక్టర్ పరికరాలను ఉంచి వచ్చే వారిని తనిఖీ చేయాలన్నారు. సంస్థలోపల, భవనం చుట్టు పక్కల అన్ని ప్రాంతాలు కవర్ అయ్యేలా తగినన్ని సీసీ కెమెరాలను అమర్చాలని దీంతో ఏదైనా నేరం జరిగినప్పుడు నిందితుల కదలికలను సులభంగా గుర్తించవచ్చునని తెలిపారు. ఆధునిక డిజిటల్ యుగంలో ప్రతి జ్యువెలరీ షాపులోనూ అడ్వాన్స్‌డ్ డిజిటల్ అలారం సిస్టమ్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పాత ఉద్యోగుల కదలికలపై యజమానులు ఎల్లప్పుడూ నిఘా ఉంచాలన్నారు. అత్యవసర సమయాల్లో సిబ్బంది వెంటనే స్పందించేందుకు డైల్ 100, స్థానిక పోలీసు స్టేషన్ నంబర్, ఎస్‌హెచ్ఓ నంబర్లను షాపులో అందరికీ కనిపించేలా ప్రదర్శించాలన్నారు. షాపులలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. షాపుల్లో దొంగతనాలు లేదా దోపిడి యత్నాలు జరిగినప్పుడు నిందితులను ప్రతిఘటించేందుకు వీలుగా సిబ్బందికి పిప్పర్ స్ప్రే అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో అదనపు డీసీపీ అడ్మిన్ కుశాల్కర్, ట్రైనీ ఐపిఎస్ అధికారి ఆయేషా ఫాతిమా, అదనపు డీసీపీ ఎఆర్ సుభాష్‌చంద్రబోస్, ఎసిపిలు, సిఐలు, జ్యువెలరీ యాజమాన్యం, షాపుల యజమానులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీ రష్మీ పెరుమాళ్

ఎంపి రఘునందన్ రావుకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ వెంకట్‌గౌడ్

మెదక్ ఎంపిని కలిసిన అప్పాజీపల్లి సర్పంచ్

కొల్చారం, మే 20 ప్రభాతవార్త : మండల పరిధిలోని అప్పాజీపల్లి గ్రామ సర్పంచ్ నాయిని వెంకట్‌గౌడ్ ఎం.రఘునందన్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని ఈ సందర్భంగా ఎంపీని కోరారు. అప్పాజీపల్లి గ్రామంలో ఉన్న రెండు అంగన్ వాడీ కేంద్రాల అభివృద్ధి, సీసీ రోడ్ల నిర్మాణం, గ్రామపంచాయతీ భవనం మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని వినతిపత్రం అందజేశారు. దీనికి ఎంపీ రఘునందన్‌రావు సానుకూలంగా స్పందించినట్లు సర్పంచ్ వెంకట్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో పోతంశెట్టిపల్లి సర్పంచ్ పాతూరి దయాకర్‌గౌడ్, కొమ్ముల రాజాగౌడ్, మహేష్‌గౌడ్, నెల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట మండలంలో గాలివాన బీభత్సం

చిన్నశంకరంపేట, మే 20,ప్రభాతవార్త: మండల వ్యాప్తంగా మంగళవారం రాత్రి కురిసిన గాలివాన బీభత్సానికి సంగాయపల్లి గ్రామంలో దుర్గమ్మకు చెందిన ఇంటి రేకులు ఎగిరిపోయాయి. అలాగే మండల కేంద్రంలోని పంచాయతీ భవనం వద్ద ఉన్న ట్రాన్సా ఫార్మర్ షార్ట్ సర్క్యూట్ కావడంతో పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిచిపోంది. వెంటనే ట్రాన్స్‌కో అధికారులు బాగుచేశారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో చెట్లు పడిపోయాయి.

సంగాయిపల్లిలో ఇంటి రేకుల షెడ్డు ఎగిరిపోయిన దృశ్యం

మెడికల్ షాపుల బంద్ విజయవంతం

కౌడిపల్లి, మే 20, ప్రభాతవార్త : అఖిల భారత ఔషధ విక్రయ సంఘాల పిలుపుమేరకు జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుల ఆదేశాల అనుసారం బుధవారం నిర్వహించిన దేశవ్యాప్తంగా ఒకరోజు మెడికల్‌షాప్‌ల బంద్ విజయవంతం అయిందని కౌడిపల్లి, కొల్చారం, చిలిపిచెడు ఏరియా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు పొన్నం మనోహర్‌గౌడ్ ప్రధాన కార్యదర్శి అశోక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆన్‌లైన్ ఔషధ అమ్మకాలను నిరసిస్తూ తలపెట్టిన బంద్‌కుగాను అసోసియేషన్ పరిధిలోగల 44 మెడికల్ షాపులు సంపూర్ణంగా బంద్ చేసి ఐక్యతను చాటినందుకు ప్రతి మెడికల్ షాప్ యజమానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. డిసిఎ ఆజ్ఞానుసారం జిల్లా ఔషధ నియంత్రణ అధికారి ఆదేశాల కట్టుబడి అత్యవసర ఔషధాలను రోగులకు ఆయా మెడికల్‌షాప్‌లో ఇవ్వడంతోపాటు డిఐ ప్రత్యేకించి ఎన్నుకోబడిన షాపుల ద్వారా సైతం అత్యవసర ప్రాణాపాయ రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఔషధాలను సరఫరా చేయడం జరిగింది. తోటి మెడికల్ షాప్ యజమానులు అఖిలభారత కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆదేశాలను బేఖాతర్ చేస్తూ మెడికల్ షాపులను తెరిచి మందులను ఉంచినట్లయితే శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు హెచ్చరించారు. దేశవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన సంపూర్ణ బందును ప్రజలు గమనించి సహకరించాలని అలాగే ఆర్ఎంపి, పిఎంపి వైద్యులు సైతం వారి సంపూర్ణ మద్దతును ప్రకటించాలని విజ్ఞప్తి చేయడం జరిగినది. బంద్‌కు సహకరించిన ప్రజలకు, పరోక్షంగా మద్దతు పలికిన ఆర్ఎంపి పిఎంపి వైద్యులకు అసోసియేషన్ తరపున వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు ఏరియా కోశాధికారి వెంకన్న, జిల్లా కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు సందీప్ కుమార్, కాలేరు శ్రీనివాస్, రాజా గౌడ్, రెడ్యా, ఏరియా సభ్యులు నరసింహ రెడ్డి, హరీష్ రెడ్డి, హరి శంకర్ గౌడ్, అనిల్ కుమార్, ప్రశాంత్, ఆసిఫ్, ప్రేమ్ కుమార్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బంద్ చేసిన మందుల షాపు

ఉరేసుకుని అన్నదాత ఆత్మహత్య

చిన్నశంకరంపేట, మే 20,ప్రభాతవార్త: ధాన్యం అమ్ముడుకాకపోవడంతో ఒక రైతు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మండల పరిధిలోని గవ్వలపల్లి పంచాయతీ అగ్రహారం గ్రామంలో జరిగింది. ఎస్ఐ శివానందం కథనం ప్రకారం... గవ్వలపల్లి పంచాయతీ అగ్రహారం గ్రామానికి చెందిన రాజయ్య (45) తనకున్న మూడెకరాలలో సాగు చేసిన వరి పంటను 20 రోజుల క్రితం అంబాజీపేటలోని కొనుగోలు కేంద్రానికి తరలించాడు. ధాన్యాన్ని తూకం చేసి అమ్ముకోవాలని ప్రయత్నించినా కాకపోవడంతో, పంట సాగు చేసిన అప్పులు చెల్లించాలని అప్పుల వారు ఒత్తిడి చేయగా, అంతంత మాత్రమే ఉన్న ఆ రైతు ఆర్థిక పరిస్థితి, పండించిన పంట అమ్ముడు పోక మనస్థాపం చెందిన రాజయ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించి ఇరుగుపొరుగువారు మెదక్‌లోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మీ, కుమారుడు శ్రావణ్ ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.

అప్పులబాధతో యువకుడు ఆత్మహత్య

జగదేవ్‌పూర్, మే 20 (ప్రభాతవార్త): అప్పుల భారం భరించలేక ఒక యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జగదేవ్‌పూర్ మండలం వట్టిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం వట్టిపల్లి గ్రామానికి చెందిన బోనకల్లూరి వెంకటేష్(30) భార్య శిరీష, ఇద్దరు పిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలం క్రితం ఇంటి నిర్మాణానికి అప్పులు చేశాడు. అవి తీర్చలేక మానసికంగా బాధపడుతుండే వాడని, ఈ విషయంపై తీవ్ర మనస్థాపానికి గురై మంగళవారం ఉదయం భార్య శిరీష పనినిమిత్తం బయటకు వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో వెంకటేష్ చీరతో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య శిరీష సాయంత్రం 6.30 గంటలకు ఇంటికి చేరుకునే సరికి వెంకటేష్ ఎంతకీ తలుపులు తెరవకపోవడంతో చుట్టుపక్కల వారిని పిలిచి తలుపులు తెరిపించి చూడగా అప్పటికే ఉరేసుకొని మృతిచెంది కనిపించాడు. శిరీష ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్కూటీని ఢీకొన్న కారు.. వ్యక్తి మృతి

హుస్నాబాద్ రూరల్, మే 20, ప్రభాతవార్త : రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం హుస్నాబాద్ మండ లం పందిళ్ల స్టేజ్ సమీపంలోని బ్రిడ్జిపై జరిగింది. హుస్నాబాద్ నుండి సిద్దిపేటవైపు వెళ్తున్న టాటాకారు, ముందుగా వెళ్తున్న స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీపై ప్రయాణిస్తున్న వ్యక్తి తీవ్రంగా గాయపడి అక్కడి కక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్లాస్టిక్ డ్రమ్‌లో పడి మహిళ మృతి

వర్గల్, మే 20 (ప్రభాతవార్త): ప్లాస్టిక్ డ్రమ్‌లో పడి మహిళ మృతిచెందిన సంఘటన వర్గల్ మండలం సింగాయిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గౌరారం ఎస్ఐ ఆరోగ్యం కథనం ప్రకారం.. సింగాయిపల్లి గ్రామానికి చెందిన టేకులపల్లి పుష్ప(40) ఆరోగ్యం బాగలేక ఇంటివద్దే ఉంటుంది. పుష్ప భర్త నారాయణరెడ్డి, కుమారుడు నరసింహారెడ్డి పనినిమిత్తం బుధవారం ఉదయం బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి చూడగా ఇంటి పక్కన ఉన్న ప్లాస్టిక్ డ్రమ్‌లో పడి ఉందని, డ్రమ్‌లో నీరు తీస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి అందులో పడి చనిపోయిందని తెలిపారు. మృతురాలి భర్త నారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బంగారం చోరీకి యత్నం..వ్యక్తి అరెస్టు

న్యాల్‌కల్, మే 20, ప్రభాతవార్త: ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళ మెడ లోని బంగారం దొంగతానికి యత్నించిన వ్యక్తి అరెస్టయిన సంఘటన మండల పరిధిలోని చీకుర్తి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ దోమ సుజిత్ కథనం ప్రకారం... చీకుర్తి గ్రామానికి చెందిన గౌని గాలమ్మ ఇంట్లో ఒంటరిగా ఉండగా ఈనెల 17న రాత్రి 8 గంటల ప్రాంతంలో అదే గ్రామానికి చెందిన శ్రీధర్ అలియాస్ తుల్జారం మహిళ మెడలోని బంగారం గుండ్లను చోరీకి యత్నించగా గాలమ్మ చేసిన అరుపులకు తుల్జారం అక్కడి నుంచి పారిపోయాడన్నారు. బాధితురాలు గౌని గాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శ్రీధర్‌ను అరెస్టు చేశామని ఎస్ఐ దోమ సుజిత్ పేర్కొన్నారు.

మొబైల్ ఫోన్ల చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

ఏడు ఫోన్లు, ఆక ఆటో స్వాధీనం

హత్నూర, మే 20, ప్రభాతవార్త :

పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులు

సంగారెడ్డి జిల్లా హత్నూర పోలీస్‌స్టేషన్ పరిధిలో మొబైల్‌ఫోన్లు దొంగిలిస్తున్న ఇద్దరు నిందితులను బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి బుధవారం తెలిపారు. మంగళవారం దౌల్తా బాద్ బస్‌స్టాప్ వద్ద బస్సు ఎక్కుతున్న సమయంలో బ్యాగ్‌లో ఉన్న మొబైల్ ఫోన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని శ్రీమాల విక్రం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించామని చెప్పారు. ఈ క్రమంలో బుధవారం దౌల్తాబాద్‌లోని తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో ఇద్దరు అనుమానితులు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా, వారిని అదుపులోకి తీసు కుని విచారించారు. విచారణలో వారు బస్సు స్టాప్‌లు, రన్నింగ్ బస్సుల్లో ప్రయాణికుల నుంచి మొబైల్ ఫోన్లు దొంగిలిస్తున్నట్లు ఒప్పుకున్నారని తెలి పారు. నిందితులు భువనగిరి జిల్లా చౌటుప్పల్ బస్టాండ్‌లో, సిద్దిపేట జిల్లా వంటి మామిడి బస్టాండ్‌లో, మెదక్ జిల్లా నర్సాపూర్ బస్టాండ్‌లలో దొంగ తనం చేసిన ఫోన్లు రికవరీచేశామని చెప్పారు. నిందితులు బెడంపల్లి ఎల్లప్ప, ఉయ్యూరు శ్రీనివాస్‌రావులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీధర్ రెడ్డి వివరించారు. నిందితుల నుంచి 7 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ రూ.85 వేలవరకు ఉంటుందని, ఒక బజాజ్ ఆటోను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

అటెండర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

అక్కన్నపేట, మే 20, ప్రభాతవార్త : అక్కన్నపేట మండల విద్యా వనరుల కేంద్రంలో ఔట్సోర్సింగ్ విధానంలో అటెండర్ పోస్టు భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ గుగులోతు రంగానాయక్ తెలిపారు. ఈ దరఖాస్తులు 21తేదీ నుంచి 22సాయంత్రం 4 గంటల వరకు స్వీకరించబడతాయని చెప్పారు.

అభ్యర్థులు పదో తరగతి మెమో, స్టడీ, కులం, నివాస ధ్రువీకరణ పత్రాలు, రెండు ఫోటోలు రెండు జిరాక్స్ సెట్లతో ఎంఈఓ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని సూచించారు.

గోరక్ష కార్యకర్తల అరెస్టులపై ఆగ్రహం

గోరక్ష కార్యకర్తలను కుల్సుంపుర పోలీస్ స్టేషన్‌కు తరలించిన దృశ్యం

మూసాపేట, మే 20, ప్రభాతవార్త
కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బబ్బుగూడ ప్రాంతంలో జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్న అక్రమ గోవుల తరలింపులు, గోవధ, అక్రమ క్రయవిక్రయాలకు వ్యతిరేకంగా నిర్వహించనున్న చలో బబ్బుగూడ కార్యక్రమానికి పిలుపునిచ్చిన గోరక్ష కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని కార్యకర్తలు తీవ్రంగా ఖండించారు. గురువారం తెల్లవారుజామున సుమారు 5 గంటల సమయంలో కార్యకర్తలను వారి ఇళ్ల వద్ద నుంచే అదుపులోకి తీసుకుని, ముందుగా సనత్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు, అనంతరం కుల్సుంపుర పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిలో కంచి మహేందర్, కృష్ణా గౌడ్, భార్గవ్ గౌడ్, హరి ప్రసాద్, విజయ్, గోగికర్ రోహిత్ ఉన్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గోరక్ష కార్యకర్తలు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపేందుకు సిద్ధమైన గోభక్తుల గొంతును అణచివేయాలని ప్రభుత్వం, పోలీసులు ప్రయత్నించడం దురదృష్టకరమని అన్నారు. అక్రమ కార్యకలాపాలపై చర్యలు తీసుకోవాల్సింది పోయి ఉద్యమకారులనే లక్ష్యంగా చేసుకోవడం ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘన అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గోవుల సంరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని, గోరక్షణ కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని కార్యకర్తలు స్పష్టం చేశారు.

23న అఖండ 34వ తాళసప్తాహ మహోత్సవం ప్రారంభం

చాంద్రాయణగుట్ట, మే 20, ప్రభాతవార్త : ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి వచ్చే అధిక మాసాన్ని (పురుషోత్తమ మాసం) పురస్కరించుకొని ఈనెల 23వ తేదీ శనివారం నుండి 30వ తేదీ శనివారం వరకు శ్రీ పాండురంగ విఠలేశ్వర్ అఖండ 34వ తాళసప్తాహ (నిరంతరంగా వారం రోజులు) మహోత్సవం – 2026ను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామ పురోహితులు గోళ్ళ నరహరి శర్మ, ఎ.విజయ్ కుమార్ల ఆధ్వర్యంలో చాంద్రాయణగుట్ట శ్రీ దేవి దేవాలయంలోని శ్రీ పంచాయతన బాల విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో అఖండ తాళ సప్తాహం జరుగుతుందన్నారు. 23వ తేదీ శనివారం ఉదయం 9గంటలకు గణపతి పూజ, కంకణ బంధనం, అఖండ దీపారాధన, నవగ్రహారాధన, తాళమృదంగాది పూజ, భాగవత పూజ, పాండురంగ విఠలేశ్వరుని పూజ, అఖండ తాళ భజన ప్రారంభం, 30వ తేదీ శనివారం తెల్లవారు జామును 5 గంటలకు కాగడ హారతి, 9గంటలకు అఖండ తాళ పరిసమాప్తి, విఠలేశ్వరుని సేవ ఊరేగింపు, గోపాల కాల్వ, అన్నదానం తదితర పూజా కార్యక్రమాలుంటాయని పేర్కొన్నారు. తొలి రోజు నుండి చివరి రోజు వరకు నిరంతరాయంగా భజన కార్యక్రమాలుంటాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆ పాండురంగ విఠలేశ్వరుని అనుగ్రహానికి పాత్రులు కాగలరని కోరారు.

మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నిరసన

పెట్రోలియం ఉత్పత్తుల ధరల పెంపును నిరసిస్తూ గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బింగి సాయికీర్త్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసిన దృశ్యం

చిక్కడపల్లి మే 20 (ప్రభాతవార్త) : కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పెంచిన పెట్రోలియం ఉత్పత్తుల ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ బుధవారం గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బింగి సాయికీర్త్ ఆధ్వర్యంలో స్థానిక జవహర్ నగర్ కమ్యూనిటీ హాల్ నుండి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్ కుమార్ యాదవ్, సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దీపక్ జాన్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ, మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి సామాన్యుడి నడుం విరుస్తున్నారని ఈ సందర్భంగా నేతలు మండిపడ్డారు. ఈ నిరసన ప్రదర్శనలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారిశెట్టి నరసింగ రావు, గుర్రం శంకర్, అభిషేక్ కెన్నెడీ, అమరం వినోద్, నరసింగరావు, రాజేష్, సాయిరాం, బాబు రావు, సతీష్, శ్రీను మరియు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యతతో సిసి రోడ్ల పనులు పూర్తి చేయాలి : ఎమ్మెల్యే ముఠా గోపాల్

సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి మే 20 (ప్రభాతవార్త) : బాగ్ లింగంపల్లి డివిజన్ పరిధిలోని అంబేద్కర్ కాలేజీ పక్క వీధిలో నూతనంగా చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ బుధవారం జిహెచ్ ఎం సి డీఈఈ గీత తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్ల ఆధునీకరణకు, మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. అంబేద్కర్ కాలేజీ పరిసర ప్రాంత ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ సీసీ రోడ్డు పనులను మంజూరు చేయించామని, వీటిని అత్యంత నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభం కాకముందే పనులన్నీ పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అభివృద్ధి పనుల్లో ఎక్కడా అలసత్వాన్ని సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, బిఆర్ఎస్ నేతలు వెంకటకృష్ణ (బబ్లూ), దామోదర్ రెడ్డి , రత్నాకర్ రెడ్డి, రమేష్ రెడ్డి, ముచకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జలమండలిలో 'గుర్తింపు సంఘానికి' మోగిన ఎన్నికల నగారా

- ఎంప్లాయిస్ యూనియన్‌కు మేవా మద్దతు
- సెక్షన్ కార్యాలయాల నుండి ప్రచారం షురూ

తన కార్యాలయంలో రాజిరెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే బలాల

చాంద్రాయణగుట్ట, మే 20, ప్రభాతవార్త : హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సివరేజ్ బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి) గుర్తింపు యూనియన్ కోసం ఎన్నికల నగారా మోగింది. జూన్ ఆరున ఎన్నికలు జరుగనున్నాయి. వివిధ యూన్‌యన్లు ఎన్నికల్లో పోటీ పడేందుకు సమాయత్తం అవుతున్నాయి. తెలంగాణ జల మండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి ఒకడుగు ముందుకు వేసి తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. పాతబస్తీలోని మొఘల్‌పురా సెక్షన్ ఉద్యోగులతో సమావేశమైయ్యారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను, న్యాయమైన డిమాండ్లను విన్నారు. జలమండలి ఎన్నికలలో అభ్యర్థుల గెలుపు, ఓటములను శాసించే ముస్లీం ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (మేవా) మద్దతు కోరారు. సమావేశం నుండి నేరుగా మలక్‌పేట్ శాసనసభ్యులు, మేవా వైస్ చైర్మన్ అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల నివాసానికి వెళ్ళారు. అతని మద్దతును కూడ గట్టారు. ఎమ్మెల్యేను సన్మానించారు. ప్రతిగా ఎమ్మెల్యే బలాల, రాజిరెడ్డిని సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ మేవా బలపర్చిన ఎంప్లాయిస్ యూనియన్ ప్యానల్‌ను గెలిపించాలని సూచించారు. జలమండలి ఉద్యోగుల సమస్యలు, న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించే యూనియన్‌ను అండగా నిలవాలన్నారు. కాగా జలమండలిలో ప్రతి నెల ఎంతో మంది ఉద్యోగ విరమణ చేస్తున్నారు. దీంతో ఉద్యోగుల సంఖ్య క్రమేణ తగ్గుతూ పోతుంది. నియామకాలు చేపట్టక పోవటంతో ఉన్న శాశ్వత ఉద్యోగులతో నెట్టుకు వస్తున్నారు. గతంలో ఐదు వేల వరకు ఉన్న ఉద్యోగులు నాలుగు నుండి మూడు వేలకు తగ్గిపోయారు. వీరికే ఎన్నికలలో ఓటు వేసే అవకాశం ఉంది. అధిక శాతం ఉద్యోగులు ఏ యూనియన్ వెంట ఉంటే వారు విజయం సాధించినట్లే. ఎమ్మెల్యే బలాలను కలిసిన వారిలో మేవా ప్రధాన కార్యదర్శి సయ్యద్ అక్తర్ అలీ, ఉద్యోగులు మజహారుద్దీన్, ముహమ్మద్ అన్వర్, షేక్ ఇబ్రహీం, ఎం.ఎ.రషీద్, రవిందర్, ముహమ్మద్ సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జీవజలం చలం సాహిత్య స్మారకోపన్యాసం

చలం చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులర్పిస్తున్న ప్రముఖులు

రవీంద్రభారతి, మే 20 ప్రభాతవార్త : చలం భావన కన్వీనర్ ప్రముఖ సాహితీవేత్త డా. నాళేశ్వరం శంకరం సభాధ్యక్షతలో జీవజలం చలం సాహిత్య స్మారకోపన్యాస సభ వైభవంగా జరిగింది. చలం పౌరాణిక సాహిత్యం–వస్తు రూపాలపై ఎన్.వేణుగోపాల్, కుప్పిలి పద్మ ప్రసంగించారు. చలం పౌరాణిక నాటిక, నాటకాలలోఇ కొన్ని ముఖ్యభాగాలను భండారు విజయ, జ్వలిత, అరుణ ధూళిపాల, గడ్డం సులోచన వినిపించారు. డా. ఏనుగు నరసింహారెడ్డి ఆప్తవాక్యంలో నాళేశ్వరం శంకరం తన పరిశోధనను జీవితమంతా విస్తరింపజేశారన్నారు. చలం ఏమిచెప్పారో అందరికీ తెలియాలి. నాటకాల్లోని పౌరాణిక పాత్రల్లో ఆధునిక భావాలున్నాయి. ఆయన భావజాలం చేత విమర్శలు ఎదుర్కొన్నాడు. ఆయన ఆదర్శానికి ఈరోజున్న రిలవెన్స్ కూడా చూడవలసి ఉందన్నారు. చలంను సరికొత్తగా అర్థం చేసుకోవాల్సి ఉందన్నారు. వేణుగోపాల్ చలం పౌరాణిక సాహిత్యం వస్తురూపాలపై ప్రసంగించారు. చలం పౌరాణిక సాహిత్యం ఇప్పటికీ చర్చనీయాంశంగా రాలేదు. పౌరాణిక వస్తువు విశిష్టమైంది. వంద సంవత్సరాలు దాటినా రిలవెన్సీ పెరిగిందన్నారు. రచనాకాలం, ప్రచురణాలతో సమగ్రంగా చలం రచనలను చూడాల్సి ఉందన్నారు. కుప్పిలి పద్మ చలం పౌరాణిక సాహిత్య రూపంపై వస్తు వైవిధ్యంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డా. నందిని సిధారెడ్డి, బైస దేవదాసు, ఎన్.వేణుగోపాల్, శీలా సుభద్రాదేవి, డా. బెల్లంకొండ సంపత్‌కుమార్, గడ్డం సులోచన తదితరులు పాల్గొని చలం చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు.

రాజకీయంగా ఎదిగితే భట్రాజులకు గౌరవం, సమస్యల పరిష్కారం : మాజీ డీజిపి పూర్ణచంద్రరావు

ప్రజాప్రతినిధులను సత్కరిస్తున్న పూర్ణచంద్రరావు, సూర్యారావు , ప్రముఖులు

నాంపల్లి, మే 20 ప్రభాతవార్త : భట్రాజులు రాజకీయంగా ఎదిగితేనే గౌరవం, సామాజిక న్యాయం దక్కుతుందని మాజీ డీజిపి డా. జె.పూర్ణచంద్రరావు అన్నారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో బిసి టైమ్స్, బిసి సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన భట్రాజు ప్రజా ప్రతిధుల అభినందన సభలో పూర్ణచంద్రరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సభకు బిసి సమాజ్ రాష్ట్ర కార్యదర్శి సంగెం సూర్యారావు అధ్యక్షోపన్యాసంలో భట్రాజు సమాజం రాజకీయంగా, సామాజికంగా, సాంస్కృతికంగా ఎలా ఎదగాలన్న అంశంపై స్పష్టమైన మార్గదర్శకం చేశారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వెలమలెంతమందున్నారో భట్రాజులూ అంతేమంది ఉన్నా అసెంబ్లీలో 13మంది వెలమ ఎమ్మెల్యేలున్నా ఒక్క భట్రాజు ఎమ్మెల్యే కూడా లేదని వాపోయారు. భట్రాజు సమాజం వాక్‌ధార కళలో సాహిత్యంలో గొప్పచరిత్ర ఉన్నా రాజకీయాధికారంలో మాత్రం వెనుకబడిందని ఆవేదన వ్యక్తపరిచారు. ఇతరులను గెలిపించినంతకాలం మన మనుగడ అగమ్యగోచరమేనని హెచ్చరించారు. సాటి బిసి, ఎస్సీ, ఎస్టీలతో చేతులు కలిపి బహుజన రాజకీయ శక్తిగా ఎదిగితేనే భట్రాజులు ఎమ్మెల్యేలు అవుతారని స్పష్టం చేశారు. బహుజన జెండా పట్టుకొని మీరెంతో మీకంతే అన్న అంబేద్కర్, కాన్షీరాం సిద్ధాంతంతో ముందుకుసాగాలని పిలుపునిస్తూ అప్పుడే భట్రాలు రాజులవుతారని తెలిపారు. భట్రాజు యువత విద్య, సంఘటితం, రాజకీయ చైతన్యంతో పైకిరావాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులను ఘనంగా సత్కరించారు.

తల్లితో సహజీవనం, కూతురిపై లైంగిక దాడి
-నిందితుడిపై పోక్సో కేసు నమోదు

అల్వాల్, మే 20 ప్రభాతవార్త: తల్లితో సహజీవనం చేస్తూ ఆమె కూతురిపై కన్నేసిన దుర్మార్గుడు. తల్లీ కూతుళ్ళపై లైంగిక పరమైన వాంచలు తీర్చుకుంటున్న ఓ కామ పిశాచిపై పోలీసులు పోక్సో కేసు నమోదు నమోదు చేశారు. ఘటనకు సంబంధించిన పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అల్వాల్ మచ్చ బొల్లారం ప్రాంతంలో నివాసం ఉంటున్న 33 సంవత్సరాలు మహిళ భర్తతో దూరంగా ఉంటూ 15 సంవత్సరాలు కూతురితో నివాసం ఉంటోంది. ఇదే ప్రాంతంలో ఉండే దుర్గా ప్రసాద్(34) కన్ను ఒంటిరి మహిళపై పడింది. మహిళతో సహ జీవనం సాగిస్తున్నాడు. నిందితుడితో పాటుగా మహిళ, మైనర్ బాలిక ఒకే ఇంట్లో నివాసం ఉంటున్నారు. కూతురిలా చూసుకోవాల్సిన బాలికను కూడా వదలకుండా దుర్గా ప్రసాద్ ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డారు. కూతురిపై జరిగిన అఘాయిత్యం తెలిసిన మహిళ అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు పోక్సో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళకు అసభ్యకర మెసేజ్‌లతో వేధింపులు

జూబ్లీహిల్స్, మే 20, ప్రభాతవార్తః
మహిళకు ఫోన్ కాల్స్, వాట్సాప్ సందేశాల ద్వారా అసభ్యక రంగా వేధింపులకు పాల్పడిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. కృష్ణానగర్ ప్రాంతంలో నివాసించే ఒక మహిళ(38) లేడీస్ టైలర్‌గా పనిచేస్తున్నారు. తన స్నేహితురాలి ఫోన్ నంబర్‌కు కాల్ చేయబోయే సమయంలో పొరపాటున విఘ్నేష్ అలియాస్ విఘ్నాన్ అనే వ్యక్తికి ఆమె ఫోన్ నుంచి కాల్ వెళ్లింది. ఆ వ్యక్తి తాను డాక్టర్‌నని పరిచయం చేసుకుని, అనంతరం ఫోన్ కాల్స్, వాట్సాప్ ద్వారా పరిచయం పెంచుకునేందుకు ప్రయత్నించాడు. కొంతకాలం తర్వాత అతడు అసభ్యకరంగా మాట్లాడటంతోపాటు అసభ్యకర వాట్సాప్ మెసేజ్‌లు పంపడం ప్రారంభించాడు. తనకు కాల్స్ చేయవద్దు అని చెప్పినా పదేపదే ఫోన్‌కాల్స్, మెసేజ్‌ల ద్వారా వేధింపులకు పాల్పడుతూ మానసిక ఇబ్బందులకు గురిచేస్తుండడంతో బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సమ సమాజ్ పార్టీ ఆవిర్భావం

సైఫాబాద్, మే 20 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పోలీసుల కాల్పులకు గురై చావుతో పోరాడి విజయం సాధించిన నాయకుడు, పిడిఎస్‌యు రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బొల్లూరి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో కొత్త రాజకీయ పార్టీ 'సమ సమాజ్ పార్టీ' (ఎస్ఎస్‌పి) ఆవిర్భావం బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ పార్టీ జెండాను, కండువాను ఆవిష్కరించి, మాట్లాడారు. సిపిఐ (ఎం–ఎల్)కు అనుబంధంగా ఉన్న పిడిఎస్‌యుకు తాను మరికొంత మంది నాయకులు రాజీనామా చేసి సమ సమాజ్ పార్టీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతిఘటనా పోరాటం, సాయుధపోరాటం సాధ్యం కాదని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని విశ్వసించి పార్లమెంటరీ పంథా ద్వారానే రాజ్యాంగ పరిధిలో ప్రజాస్వామిక పద్ధతిలో ప్రజలలో చైతన్యం తీసుకువచ్చి రాజ్యాధికారం ద్వారానే ప్రజలను విముక్తి చేయగలమని, అభివృద్ధి చేయగలమని నిర్ణయించుకోవడం జరిగిందన్నారు. తమ పార్టీని రాష్ట్ర వ్యాప్తంగా బలోపేతం చేసి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటి చేసి తమ పార్టీని అధికారంలోకి తీసుకువస్తామన్నారు. ఈ సమావేశంలో నాయకులు బాల్‌రాజ్, అనిల్‌కుమార్, పరుశురామ్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

రచయిత్రి చంద్రమోహన్‌కు మాదిరాజు వరలక్ష్మి పురస్కారం

చిక్కడపల్లి మే 20 (ప్రభాతవార్త) : ప్రముఖ రచయిత్రి జలంధర చంద్రమోహన్‌కు మాదిరాజు వరలక్ష్మి పురస్కారం ప్రధానం చేయబోతున్నట్లు నిర్వాహక సంస్థ అధినేత్రి డాక్టర్ ఈ.భవాని వివరించారు. 22 న చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో ని కళాసుబ్బారావు కళావేదికలో ప్రముఖ సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ అభినందన 40 ఏళ్ళ పండగ ఉత్సవాలలో భాగంగా మాతృదినోత్సవం మాతృవందనం" పేరిట ఈ సభ జరగనుంది. ప్రముఖ రచయిత్రి శ్రీమతి జలంధర చంద్రమోహన్ కు ప్రతిష్టాత్మక మాదిరాజు వరలక్ష్మి పురస్కారం (అభినందన భవాని మాతృమూర్తి) అందజేయనున్నారని తెలిపారు.

సెప్టిక్ ట్యాంక్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మైలార్‌దేవ్‌పల్లి, మే 20 ప్రభాతవార్త : సెప్టిక్ ట్యాంక్‌లో లో తేలాడుతున్న గుర్తు తెలియని ఓ వ్యక్తి మృత దేహాన్ని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురికి తరలించారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీసుల కథనం ప్రకారం..అవలన్ అన్‌మోల్ కన్‌స్ట్రక్షన్ ప్రక్కన ఉన్న లేబర్ క్యాంప్ ప్రక్క నుంచి దుర్వాసన రావటంతో స్థానికులు వెళ్లి చూడగా ఓపెన్ సెప్టిక్ ట్యాంక్‌కు ఒక వైపు రేకులు కప్పి ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లో గుర్తు తెలియని 35 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం తేలుతూ కనిపించింది. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘ టన స్థలానికి చేరుకుని గుర్తు తెలియని ఆ వ్యక్తి మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురికి తరలించారు. మృతుడి శరీరంపై అమ్మ, దేవా, ఆర్‌ఆర్‌ఆర్, ఎం.రాము అనే పుట్టు మచ్చలు ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తి నలుపు రంగు ప్యాంట్, నలుపు రంగు షర్టు ధరించాడు. ఈ కేసును మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అన్ని కోణాలు నుంచి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియపై రాజకీయ పార్టీల సమావేశం


సమావేశంలో పాల్గొన్న బహదూర్‌పుర డిఎంసి అరుణ కుమారి

చార్మినార్, మే 20 ప్రభాతవార్త : పాతబస్తీ బహదూర్‌పుర నియోజకవర్గంలో త్వరలో ప్రారంభం కానున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై ఎలక్ట్రాన్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ మరియు బహదూర్‌పుర డిఎంసి అరుణ కుమారి ఆధ్వర్యంలో బుధవారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం జరిగింది. సమావేశంలో బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్ ఎస్ఐఆర్ ప్రక్రియపై పలు సూచనలు చేశారు. పోలింగ్ బూతులో ఓటర్ల సంఖ్య 1200 నుంచి 1000 వరకు తక్కువగా ఓటర్లు ఉండే విధంగా చూడాలని, 2002, 2025 సంవత్సరాలకు సంబంధించిన ఓటర్ లిస్టలను రాజకీయ పార్టీలకు అందించాలి, ఎస్ఐఆర్‌లో సేకరించిన సమాచారాన్ని ఐదు సంవత్సరాలు పాటు ఈఆర్ఓ కార్యాలయంలో భద్రపరచాలని ఆయన సమావేశంలో కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

చిత్ర రంగంపై ఆధారపడిన వారికి పూర్తి సహకారం అందిస్తా

కూర్మారావుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న ప్రముఖులు

సైఫాబాద్, మే 20 ప్రభాతవార్త: ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టిపిసి) తెలంగాణ రాష్ట్ర హెల్త్ కమిటీ నూతన చైర్మన్ ఎస్.కుర్మారావు నియమితులైనారు. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయనకు ప్రముఖ సినీ నటులు రవీందర్, వనితాచందర్ తదితరులు నియామక ప త్రాన్ని అందజేసి అభినందనలు తెలి యజేశారు. ఈ సందర్భంగా కూర్మారావు మాట్లాడుతూ చిత్ర రంగంపై ఆధారపడిన వారికి తన వంతు సహకారం పూర్తిగా అందిస్తానని చెప్పారు. రాష్ట్ర హెల్త్ కమిటీ చైర్మన్‌గా తనను నియమించడం వల్ల తనపైన మరింతగా బాధ్యత పెరిగిందన్నారు. సినీ నటులు మాట్లాడుతూ ఎఫ్‌టిపిసి ఇండియా గ్లోబల్‌లో ఎంతో ప్రేరు ప్రఖ్యాతలు గడించినది ఈ సంస్థనేని అని కొనియాడారు. ఎఫ్‌టిపిసి ఇండియా అధ్యక్ష, కార్యదర్శులు జంగా చైతన్య, పాకలపాటి విజయ్‌వర్మ మాట్లాడుతూ ఫిల్మ్ టూరిజం అభివృద్ధి చేయడంలో కూర్మారావు తప్పక సఫలీకృతం అవుతారని అశాభావం వ్యక్తం చేశారు. కూర్మారావు ఆరోగ్య రంగంలో గత రెండు దశాబ్దాలుగా వివిధ కార్పోరేట్ హాస్పటల్స్‌లో పనిచేసిన అనుభవం, నిర్వహణ కార్యక్రమాల చొరవ తమను ఎంతగానో అకట్టుకున్నాయన్నారు. ప్రతి మనిషికి ఆరోగ్యంపై ఎంతో శ్రద్ధ అవసరమని సినీ రంగంలోని 24 క్రాఫ్ట్స్, చిత్ర రంగంపైన ఆధారపడినవారు వారి కుటుంబ సభ్యులకు అతి తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో ఎఫ్‌టిపిసి సభ్యులు జి.మధుకర్, ఎం.ఈశ్వర్‌రావు, తెలంగాణ మీడియా చైర్మన్ కిరణ్ బేజాడి, కోడె చైతన్య, నటి భవనా నల్కర్ పాల్గొన్నారు.

వెంటనే స్వర్ణకార కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

సమావేశంలో నిరసన తెలుపుతున్న స్వర్ణకారులు

సైఫాబాద్, మే 20 ప్రభాతవార్త: రాష్ట్రంలోని 12 లక్షల మంది స్వర్ణకారుల భవిష్యత్ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్వర్ణకారుల కార్పోరేషన్‌లను ఏర్పాటు చేసి ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం డిమాండ్ చేసింది. పది రోజుల్లోగా ప్రభుత్వం ప్రకటన చేయకపోతే వేలాది మందితో రాష్ట్ర మహాసభ ఏర్పాటు చేసి అసెంబ్లీని ముట్టడిస్తామని సంఘం నాయకులు హెచ్చరించారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వింజమూరి రాఘవాచారి, చేపూరి వెంటకస్వామి, కోశాధికారి గొట్టిముక్కల చంద్రశేఖర్ మాట్లాడుతూ స్వర్ణకారుల కార్పోరేషన్ కోసం గత పది సంవత్సరాలుగా తాము రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసి చెప్పులు అరిగిపోయేలా విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాలలో స్వర్ణకారులకు పనులు లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం స్వర్ణకారులను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి పిసిసి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు స్వర్ణకారులకు కార్పోరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచేస్తామని హామీచ్చారని, ఆ హామీని నేటి వరకు అమలు చేయలేదన్నారు. వెంటనే కార్పోరేషన్‌ను ఏర్పాటు చేసి ప్రతి స్వర్ణకారునికి వడ్డీలేని రుణాలు పది లక్షల వరకు ఇవ్వాలని, కార్పోరేషన్‌ను తమ సంఘ నాయకులతో చర్చించి పాలక మండలిని నియమించాలని, 50 సంవత్సరాలు నిండిన ప్రతి స్వర్ణకారునికి 4 వేలు ఫించన్ చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశం సంఘం రాష్ట్ర కార్యదర్శి రాగిఫణి సతీష్‌కుమార్, కిషన్, సంతోష్, మనోరమ, భీష్మాచారి తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధితో కార్పొరేట్ వైద్యం
- ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

అర్హులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.

నార్సింగి, మే 20 ప్రభాతవార్త : నిరుపేదలందరూ సీఎం సహాయ నిధి డబ్బులతో కార్పోరేట్ వైద్యం పొందుతున్నారని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం గ్రేటర్ హైదరాబాద్ 122.వ,డివిజన్‌కు చెందిన దుద్దు కిరణ్‌కు రూ.60.వేలు, ఇందిరమ్మ కాలనీకి చెందిన మాన్య నాయక్‌కు రూ.60.వేలు, లక్ష్మణ్ నాయక్‌కు రూ.29.వేల సీఎం సహాయ నిధి చెక్కులను మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, సీనియర్ నేత సురేష్‌గౌడ్‌లతో కలిసి ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పేదలకు పెద్ద రోగాలు వస్తే ప్రాణాలపై ఆశ వదులుకొని దేవుడిపై భారం వేసేవారని, ఇప్పుడు సీఎం సహాయ నిధి డబ్బులు పెద్ద మొత్తంలో ఇస్తుండడం వలన కార్పోరేటర్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకొని ప్రాణాలను రక్షించుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం సహాయ నిధి డబ్బులను పెంచడంతో దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి సహాయం అందడం జరుగుతుందని వివరించారు. ప్రజల ఆరోగ్యం కోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, గోపాల్ నాయక్, గోపాల్, స్వామి నాయక్, ప్రభాకర్ పాల్గొన్నారు.

హైదర్షాకోట్‌లో మంచినీటి సమస్యను పరిష్కరించాలని జిఎంకు వినతి

జలమండలి జిఎంకు వినతిపత్రం అందజేస్తున్న బిజెపి అధ్యక్షులు మహేష్ యాదవ్.

నార్సింగి, మే 20 ప్రభాతవార్త : హైదర్షాకోట్ డివిజన్ పరిధిలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, వెంటనే జల మండలి అధికారులు స్పందించి నీటి ఇబ్బందులు తొలగించాలని కోరుతూ బిజెపి అధ్యక్షులు మహేష్ యాదవ్ జిఎంకు వినతి పత్రంను అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వమంటూ గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ పాలనలో ప్రజలకు కనీస అవసరమైన మంచినీటి సరఫరాను కూడా చేయలేక చెతికిల పడుతున్నారని పేర్కొన్నారు. ఎండ తీవ్రత పెరుగడంతో ఇళ్లల్లో వేసుకున్న బోర్లన్నీ వట్టిపోయాయని, జల మండలి నీరు ఐదు రోజులకు ఒకసారి వదులడంతో తీవ్రమైన నీటి ఎద్దడి నెలకొందన్నారు. ట్యాంకర్లపైనే ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు నీటి కోసం అల్లాడిపోతుంటే అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జల మండలి అధికారులు కనీసం రెండు రోజులకు ఒకసారైనా మంచినీటిని సరఫరా చేయాలని, లేదంటే ట్యాంకర్ల ద్వారా ఇంటింటికి నీటి సరఫరా చేసి ప్రజల ఇబ్బందులు దూరం చేయాలని మహేష్ యాదవ్ డిమాండ్ చేశారు. జీఎంకు వినతిపత్రం అందజేసిన వారిలో బిజెపి నేత నరేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.

రమేష్‌గౌడ్‌ను పరామర్శించిన రాంనర్సింహాగౌడ్

హైదరాబాద్, మే 20,ప్రభాతవార్త: ఉస్మానియా యూనివర్సిటీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఎల్ బి నగర్ లోని పవన్ సాయి హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న ఉస్మానియా పరిశోధక విద్యార్థి , టిఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోటపోతుల రమేష్ గౌడ్‌ను బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డాక్టర్ వీరమళ్ళ రామ్ నరసింహ గౌడ్ బుధవారం పరామర్శించారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే ఆసుపత్రికి వెళ్ళి డాక్టర్లను కలిసి రమేష్‌గౌడ్ ఆరోగ్యపరిస్థితిపై ఆరా తీశారు. ఆయతోపాటు డాక్టర్ ఆలేటి శ్రీనివాస్ గౌడ్, జంగయ్య, కాటం శివ, ప్రశాంత్ రెడ్డి ఉన్నారు.

హిందూ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ

హిందూ సమ్మేళన పోస్టర్‌ను ఆవికరించిన దృశ్యం

చిక్కడపల్లి మే 20 (ప్రభాతవార్త) :
హిందూ సమ్మేళన నిర్వహణ సమితి ఆధ్వర్యంలో 23 న గాంధీనగర్ డివిజన్‌లోని ఆంధ్రాకేఫ్ చౌరస్తా వద్ద నిర్వహించనున్న హిందూ సమ్మేళనం కార్యక్రమ పోస్టర్‌ను బుధవారం బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్ ఆవిష్కరించారు. డివిజన్‌లోని శ్రీ ముత్యాలమ్మ ఆలయం ఆవరణలో వినయ్ కుమార్ ఆవిష్కరించి మాట్లాడుతూ హిందూ సమాజంలోని ఐక్యతను చాటిచెప్పేందుకు ఈ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలోని హిందూ బంధువులు, యువకులు, మహిళలు, వివిధ హిందూ సంఘాల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, వెంకటరమణ, డాక్టర్ చంద్రశేఖర్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు వి. నవీన్ కుమార్, ఆనంద్ రావు, సోమిశెట్టి శ్రీనివాస్, రాధాకృష్ణ, సత్యనారాయణ, శకుంతల, శశికళ పాల్గొన్నారు.

గానసభలో అలరించిన పార్వతీ కల్యాణం హరికథ

భాగవతార్ స్వాములపల్లి చిరంజీవాచార్యులు ను సత్కరిస్తున్న గానసభ అధ్యక్షుడు కళా వీఎస్ జనార్ధనమూర్తి

చిక్కడపల్లి మే 20 ప్రభాతవార్త :
చిక్కడపల్లి త్యాగరాయగానసభ నిర్వహణలో గానసభలోని గుండవరపు హనుమంతరావు కళావేదికపై బుధవారం హరికథా గాన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ భాగవతార్ స్వాములపల్లి చిరంజీవాచార్యులు భక్తిభావభరితంగా పార్వతీ కల్యాణం హరికథను వినిపించి భక్తులను, ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఈ కార్యక్రమానికి గానసభ అధ్యక్షుడు కళా వీఎస్ జనార్ధనమూర్తి అధ్యక్షత వహించారు. హరికథా గానంలో చిరంజీవాచార్యులు తన గళంతో, హావభావాలతో పార్వతీ కల్యాణ ఘట్టాన్ని కళ్లకు కట్టినట్లు వివరించారు. ఆయనకు మృదంగంపై తారక్, వయోలిన్‌పై అభిరాం అద్భుతమైన వాద్యసహకారాన్ని అందించి కార్యక్రమాన్ని మరింత రక్తికట్టించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కళాకారులు, గానసభ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కళాభిమానులు పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన భర్త రిమాండ్

ముషీరాబాద్, మే 20, ప్రభాతవార్త: భార్యను కత్తితో పొడిచి దారుణంగా హత్య చేసిన భర్తను గాంధీనగర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మంగళవారం గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కవాడిగూడలోని ఒక స్పాసెంటర్ వద్ద రాజు అనే వ్యక్తి తన భార్య దెబోరాను హత్య చేసిన విషయం విదితమే. భార్యను చంపిన అనంతరం రాజు అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. అత్తాపూర్ పోలీస్ స్టేషన్ నుంచి తరుపరి దర్యాప్తు నిమిత్తం గాంధీనగర్ పోలీసులు రాజును తమ అదుపులోకి తీసుకున్నారు. రాజు నేరం అంగీకరించటంతో, అతని వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన కత్తిని, ద్విచక్ర వాహనాన్ని గాంధీనగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాజుపై హత్యా కేసుతో పాటు ఆమ్స్ యాక్ట్‌తో పాటు పలు సెక్షన్‌ల క్రింద కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు గాంధీనగర్ పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

చార్మినార్, మే 20 ప్రభాతవార్త : పాతబస్తీ పెట్లాబుర్జు ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి రెండవ గేటు వద్ద పడి ఉన్నగుర్తు తెలియని 60 సంవత్సరాల ఓ వ్యక్తి మృత దేహాన్ని హుస్సేనీఆలం ఆలం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం..... ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం 2 గంటల సమయంలో పెట్లాబుర్జు ప్రసూతి ఆసుపత్రి రెండవ గేట్ వద్ద గుర్తు తెలియని 60 సంవత్సరాల వృద్ధుడు చనిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గుర్తు తెలియని ఆ వ్యక్తి మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురీలో భద్రపరిచారు. మృతుడి దేహంపై నల్ల రంగు ఫ్యాంటు ఉంది. బంధువులు ఎవరైనా ఉంటే హుస్సేనీఆలం పోలీసులను సంప్రదించాలి. ఈ కేసును హుస్సేనీఆలం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న ఎఎంసి చైర్మన్

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

ఎఎంసి చైర్మన్ చెరుకు విజయ్‌రెడ్డి

తొగుట, మే 20, ప్రభాతవార్త : మండల పరిధిలోని జప్తిలింగారెడ్డిపల్లి, రాంపూర్, వెంకటరావుపేట, చందాపూర్, తొగుట మార్కెట్‌యార్డు, తుక్కాపూర్ గ్రామాల్లో ఏర్పాటుచేసిన ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎఎంసి చైర్మన్ చెరుకు విజయ్‌రెడ్డి బుధవారం అధికారులు, రైతులతో కలిసి పరిశీలించారు. ప్రతి వరి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. లారీల కొరత, వడ్ల కొనుగోలు ఆలస్యం జరుగుతుందని రైతుల తన దృష్టికి తెచ్చారని వెంటనే పోలీసు, రెవెన్యూ అధికారులతో మాట్లాడి ట్రాన్స్‌పోర్టు సమస్య రాకుండా చూడడంతోపాటు ధాన్యం కొనుగోలులో వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఎపిఎం బాబురావు, ఎఎంసి మార్కెట్ కో-ఆపరేటివ్ కమిటీ కార్యదర్శి స్వామి.సునీల్, రవీందర్, శోభా కొండల్‌రెడ్డి, బండారు కవిత స్వామి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొంగరి నర్సింలు, భరత్‌తేజ, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్

తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బిజెపి నేతలు

చిన్నకోడూరు, మే 20, ప్రభాతవార్త : ధాన్యాన్ని కొనుగోలుచేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బిజెపి జిల్లా అధ్యక్షులు బైరి శంకర్‌ముదిరాజ్ అన్నారు. బుధవారం చిన్నకోడూరులోని అల్లీపూర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడి వెంటనే పొద్దుతిరుగుడు పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పొద్దుతిరుగుడు పంట తెచ్చి 60 రోజులు గడిచిపోతున్నా కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. పొద్దుతిరుగుడు పంటను కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర చెల్లించి ఆదుకోవాలన్నారు.కార్యక్రమంలో బిజెపి నాయకులు జనార్ధన్, మడివల్లి బాపయ్య, సూరగోని శేఖర్‌గౌడ్, రెడ్డి మహేందర్‌రెడ్డి, పిట్ల పర్శ రాములు, ఒగ్లాపూర్ మహేష్,ఎదుల్లా శ్రీనివాస్‌రెడ్డి, నిమ్మల శ్రీనివాస్, భూపేష్‌గౌడ్, రైతులు మల్లేశం, రవి, రాజయ్య, శంకరయ్య, మహేందర్ రెడ్డి, మల్లారెడ్డి, రాజిరెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'యూత్ పార్లమెంటు'

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:

యూత్ పార్లమెంట్‌లో పాల్గొన్న యువతీ, యువకులు

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా యువజన క్రీడా వ్యవహారాలశాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో యువతి, యువకులతో యూత్ పార్లమెంట్ నిర్వహించారు.ఈ సందర్భంగా పార్లమెంటు సమావేశాల వలే జీరో అవర్, క్వశ్చన్ అవర్ బిల్లు ప్రవేశపెట్టే పద్ధతి, ఓటింగ్, వాద ప్రతివాదనలు మొదలైన విషయాలతో యూత్ పార్లమెంట్ ఆకట్టుకుంది. యువతి, యువకులు ఉత్సాహంగా పాల్గొని తమ స్పీచ్‌లను వినిపించారు. స్పీకర్‌గా సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయుడు ఎర్రన్నగారి రాంగోపాల్‌రెడ్డి వ్యవహరించగా ప్రధానమంత్రిగా శిరీష, ప్రతిపక్ష నాయకుడిగా రాజు, మంత్రులుగా రసజ్ఞ, అనంది, హరికృష్ణ, నగేష్, చందనలు వ్యవహరించారు. వివిధ పక్షాల ఫ్లోర్ లీడర్లుగా సౌమిత్, తన్వి, అఖిల, సాయిలు వ్యవహరించారు. విద్యార్థులకు, యువతి,యువకులకు పెయింటింగ్, డాన్స్ కాంపిటీషన్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడ వ్యవహారాల అధికారి, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, మామిడి పూర్ణచందర్‌రావు, బండి సమ్మయ్య, పబ్బతి శ్రీనాకర్‌రెడ్డి, మనోహర్, ఉప్పలయ్య, సౌందర్య, రాధారి నాగరాజు, సాదత్ అలీ, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా గాంధీ పాఠశాలలో ప్రవేశాలకు అహ్వానం

కొండపాక, మే 20, ప్రభాతవార్త :

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికిగాను 6,7వ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను అహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ గౌతమి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన(బాలికలకు) విద్యార్థినిలకు ఉచిత విద్య, వసతి, భోజనంతోపాటు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందించడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలలో అనుభ వజ్ఞులైన ఉపాధ్యాయుల చేత విద్యాబోధన ఉంటుందని, నాణ్యమైన విద్య తోపాటు స్పోకెన్ ఇంగ్లీష్, డ్యాన్స్, క్రీడలు, కంప్యూటర్ విద్య, తదితర అంశాలతోపాటు ప్రత్యేక శిక్షణ ఇస్తామని ఆమె తెలిపారు. ఆసక్తిగల విద్యార్తులు పాఠశాలలో సంప్రదించి ప్రవేశాలు పొందాలని సూచించారు. ఇతర వివరాలకు 9392510825 నెంబర్ సంప్రదించాలన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలకు హెల్ప్‌లైన్ సెంటర్ మంజూరు

గజ్వేల్ టౌన్, మే 20 (ప్రభాతవార్త):

తెలంగాణ ప్రభుత్వ కామన్ ఎంట్రన్స్ టెస్టులు (సెట్స్) సంబంధిత కౌన్సిలింగ్ కార్యక్రమాల కోసం ప్రభుత్వం గజ్వేల్‌లోని ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాలకు హెల్ప్‌లైన్ సెంటర్ (హెచ్ఎల్‌సి)ని మంజూరు చేసినట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చి.వి.కృష్ణారావు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ గజ్వేల్ మరియు పరిసర ప్రాంతాల విద్యార్థులకు సౌకర్యం కల్పించాలనే ఉద్దేశ్యంతో ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఐఎఎస్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ దేవసేనలు గజ్వేల్ పాలిటెక్నిక్ కళాశాలలో హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటుకు అనుమతి మంజూరు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు పాలిసెట్, ఎప్‌సెట్, ఐసెట్, ఈసెట్ తదితర కౌన్సిలింగ్‌ల కోసం స్లాట్ బుకింగ్ చేసుకునే సమయంలో జిఎంఆర్‌పి గజ్వేల్‌ను హెల్ప్‌లైన్ సెంటర్‌గా ఎంపిక చేసుకోవాలన్నారు. అలాగే గజ్వేల్, సమీప ప్రాంతాల విద్యార్థులతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన విద్యార్థులందరూ ప్రభుత్వ పాలిటెక్నిక్ గజ్వేల్‌లో కల్పించిన ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. హెల్ప్‌లైన్ సెంటర్ మంజూరు చేసిన ఉన్నత విద్యాశాఖ కార్యదర్శికి, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కబ్జాలో ఉన్నవారికే ప్రభుత్వ భూములు

-ఎఐఎకెఎస్ నాయకులు

ప్రభుత్వ భూములను సందర్శించిన ఎఐఎకెఎస్ నాయకులు

కొండపాక, మే 20, ప్రభాతవార్త:

ప్రభుత్వ భూముల్లో కబ్జాలో ఉన్నవారికే అట్టి భూములను కేటాయించాలని అల్ ఇండియా అగ్రగామి కిసాన్ సభ కంట్రోల్ కమిటీ చైర్మన్ అందే బీరన్న, పార్టీ జిల్లా అధ్యక్షుడు బోదాసు మైసయ్య, మండల అధ్యక్షుడు సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కొండపాక శివారులోని 75 ఎకరాల ప్రభుత్వ మిగులు భూమిని వారు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబర్లు 184, 186, 187, 188, 189, 190, 191, 192, 193, 194 లలో 75 ఎకరాల మిగులు భూమిగా (సీలింగ్ చట్టం ప్రకారం) ప్రభుత్వం గుర్తించి స్వాధీనం చేసుకుందని వారు తెలిపారు. ప్రభుత్వం తన అధీనంలోకి తీసుకున్న భూములను సదరు వ్యక్తులే రికార్డులను తారుమారు చేసి తిరిగి అట్టి భూములను స్వాధీనం చేసుకున్నరన్నారు. అట్టి భూమిలో చాలా సంవత్సరాల నుండి కబ్జాలో ఉండి సాగు చేసుకుంటున్న రైతులను బెదిరిస్తు, భయభ్రాంతులకుగురి చేస్తున్నారని వారు ఆరోపించారు. ఇప్పటి వరకు కబ్జాలో ఉన్న రైతులకే అట్టి మిగులు భూములను కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించిన సర్పంచ్

మర్కుక్, మే 20, ప్రభాతవార్త:

కొన్ని రోజులుగా పాములపర్తి గ్రామంలోని 1వ వార్డులో కొన్ని కుటుంబాలకు మిషన్ భగీరథ పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరా కాకపోవడంతో సమస్యను తెలుసుకున్న గ్రామ సర్పంచ్ భవాని బాలకిషన్ బుధవారం సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. పారిశుద్ధ్యం, పలు అభివృద్ధి సమస్యలపై ప్రత్యేక దృష్టి పెడతానని తెలిపారు. నీటి సమస్యను పరిష్కరించిన సర్పంచ్‌కు వార్డు ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జుట్టు సుధాకర్, వార్డు సభ్యులు మ్యాకల శ్రీనివాస్, వాటర్‌మెన్ మహేష్, గ్రామస్తులు ఉన్నారు.

పిల్లలపట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

-తొగుట సిఐ లతీఫ్

రాయపోల్, మే 20, ప్రభాతవార్త:

ఎండాకాలం సెలవుల సందర్భంగా పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తొగుట సిఐ లతీఫ్ సూచించారు. పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ఉండడంతో పిల్లలు ఎక్కువ సమయం ఇంటి వద్ద గడుపుతున్న నేపథ్యంలో వారి కార్యకలాపాలపై నిత్యం దృష్టి పెట్టాలని సూచించారు. ప్రత్యేకంగా చెరువులు, కుంటలు, కాలువలవద్దకు వెళ్లి ఈతకొట్టే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున పిల్లలను ఒంటరిగా పంపవద్దని హెచ్చరించారు. అలాగే మొబైల్ ఫోన్‌ల వినియోగం విషయంలో కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా యాప్‌లలో గుర్తుతెలియని వ్యక్తులతో పరిచయాలు పెంచుకుని మోసపోతున్న ఘటనలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారు, ఎవరితో మాట్లాడుతున్నారు, ఫోన్లలో ఏమి చూస్తున్నారు అనే విషయాలపై తల్లిదండ్రులు పర్యవేక్షణ కొనసాగించాలని అన్నారు. తల్లిదండ్రులు తమపిల్లల భవిష్యత్తును దృష్టిలోపెట్టుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, మంచిమార్గంలో నడిపించాలని సూచించారు.

రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు

కొనుగోలు కేంద్రాల వద్దకు లారీలను పంపిస్తున్న అధికారులు

రాయపోల్, మే 20, ప్రభాతవార్త:

మండల పరిధిలోని ఐకెపి కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ధాన్యం త్వరగా రైస్ మిల్లులకు తరలించేందుకు లారీలను ఏర్పాటు చేసి కొనుగోలు కేంద్రాలకు పంపించే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. రాయపోల్ తహసీల్దార్ మరియు తొగుట సిఐ లతీఫ్ ఆధ్వర్యంలో చేగుంట రోడ్డులోని వడ్డేపల్లి ఎక్స్ రోడ్డు సమీపంలో లారీలను తనిఖీల నిర్వహించి లారీ యజమానులతో మాట్లాడి కొనుగోలు కేంద్రాలకు పంపించారు. అలాగే రైస్ మిల్లులలో టోకెన్ ప్రకారం ధాన్యాన్ని త్వరగా అన్‌లోడింగ్ చేయాలని మిల్లర్లకు సూచనలుచేసినట్లు అధికారులు తెలిపారు. రైతులు ధాన్యంవిక్రయంలో ఇబ్బందులు ఎదుర్కోకుండా, కొనుగోలు కేంద్రాల వద్ద నిల్లలు పెరగకుండా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు పేర్కొన్నారు. ధాన్యం సకాలంలో తరలింపుతో రైతులకు ఉపశమనం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయపోల్ ఎస్ఐ మానస, ఏపిఎం యాదగిరి, ఎవిఐ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు న్యాల్‌కల్‌లో జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

-సొసైటీ చైర్మన్ సిద్దలింగయ్యస్వామి

న్యాల్‌కల్, మే 20, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని సొసైటీ కార్యాలయ ఆవరణలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు న్యాల్‌కల్ సొసైటీ చైర్మన్ సిద్దలింగయ్యస్వామి తెలిపారు. జొన్నలను ఆరుగాలం కష్టించిన పండించిన రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు చైర్మన్ సిద్దలింగయ్యస్వామి సూచించారు. క్వింటాళు జొన్నలకు 3699 రూపాయల మద్దతుధరను ప్రభుత్వం అందచేస్తుందన్నారు. కొనుగోలు కేంద్రానికి జొన్నలను సరఫరా చేసిన రైతులు తమ పట్టాపాసుపుస్తకం, బ్యాంక్ పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్సు పత్రాలను అందచేయాలని, జొన్నలకు సంబంధించిన డబ్బులను రైతుల బ్యాంక్ ఖాతాలో జమచేస్తామన్నారు. రైతులు జొన్నలను కొనుగోలు కేంద్రానికి తరలించి మద్దతు ధరను అందుకోవాలని మధ్య దళారులకు జొన్నలు అమ్ముకుని ఆగం కావొద్దని చైర్మన్ రైతులకు సూచించారు. న్యాల్‌కల్‌లో ప్రారంభం అయ్యే జొన్నల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ సిద్దలింగయ్యస్వామి సూచించారు.

ఆడబిడ్డల కుటుంబాలకు సర్పంచ్ నగదు కానుక

-ఎన్నికల హామీ అమలుచేసిన సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి

కొల్చారం, మే 20, ప్రభాతవార్త:

కొల్చారం మండలం చిన్నఘనాపూర్ గ్రామ సర్పంచ్ చందాపురం మధుసూదన్‌రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ గ్రామంలో జన్మించిన ఆడపిల్లల కుటుంబాలకు నగదు సహాయాన్ని అందజేశారు. గ్రామపంచాయతీ ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా"మీ ఇంటి మహాలక్ష్మికి మా ఇంటి చిరుకానుక" అనే పథకాన్ని ప్రారంభించి, గ్రామ అభివృద్ధితో పాటు ఆడబిడ్డల పట్ల గౌరవం పెంపొందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో జన్మించిన ఆడపిల్లల కుటుంబాలకు సర్పంచ్ తన సొంతనిధులతో ఒక్కొక్కరికీ రూ. 5,116 చొప్పున నగదు అందజేశారు. పోతరాజు లక్ష్మిభాస్కర్, మంద వరలక్ష్మిప్రశాంత్, శ్రీకాంత్‌రాజ్, నాన్నగారి కృష్ణవేణిసందీప్, తాటి శోభ వెంకటేశం, నాగం చిత్రనితిన్, నాన్నగారి అర్చనహరీష్ కుటుంబాలకు ఈ నగదు సహాయం అందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అంకమ్మ నరసింహులు, పిఎసిఎస్ చైర్మన్ మంద నాగయ్య, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్, ఉపాధ్యక్షుడు దార ప్రకాష్, వార్డు సభ్యులు రామవత్ సురేష్, నాగ రమేష్, నాయకోటి రమేష్, వడ్ల లక్ష్మీపతి, శ్రీనివాస్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, కమ్మరి నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సాగు యాజమాన్య పద్ధతులపై అవగాహన

రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

కొల్చారం, మే 20, ప్రభాతవార్త:

మండలపరిధిలోని అంసాన్‌పల్లి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజేంద్రనగర్, హైదరాబాద్‌కు చెందిన వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ బి.సవిత, ఎం.ప్రమేళ వివిధపంటల్లో అనుసరించాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులపై వివరించారు. ఏఈఓ రాజశేఖర్ సమతుల్య ఎరువుల వినియోగంపై రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, రైతులు, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ రాజశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు

కంటోన్మెంట్,మే 20 ప్రభాతవార్త: నవ కంటోన్మెంట్ నిర్మాణబాటలో భాగంగా నియోజకవర్గంలోని పలుబస్తీల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. గురువారం బాలంరాయి అన్నానగర్‌లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాల భవనం పైకప్పు పూర్తిగా ధ్వంసమైన దృశ్యాన్ని ఆయన పరిశీలించారు. అదే విధంగా విద్యార్థులకు ప్లేగ్రౌండ్ లేదని సూచించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వ పాఠశాలల్లో మంచినీరు, టాయిలెట్స్, ఫర్నిచర్, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపర్చేందుకు సిఎస్ఆర్ నిధులతో పాఠశాల అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. అదేవిధంగా మహావీర్ ఇంటర్నేషనల్ హుడాన్ సంస్థ ప్రతినిధుల సహకారంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు.

సమస్యల పరిష్కారానికి గులాబిజెండా: తలసాని

అడ్డగుట్ట, మే 20, ప్రభాతవార్త: జలమండలి విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యలపరిష్కారానికి గులాబి జెండా అండగా ఉంటుందని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. వచ్చే నెల 6వ తేదీన జరగనున్న వాటర్ వర్క్సు బోర్డు గుర్తింపు యూనియన్ ఎన్నికల గెలుపుకు బిఆర్ఎస్ అనుబంధ సంఘం ప్రతినిధులు బుధవారం మారేడ్ పల్లిలోని తలసాని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి గుర్తింపు ఎన్నికల కోసం తమకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో జలమండలి యూనియన్ ప్రధానకార్యదర్శి ఎల్లమయ్య, నాయకులు శివశంకర్, నర్సింహ్మ, జ్ఞానేశ్వర్, పాపయ్య, రాంచంద్రారెడ్డి, భూమయ్య, శ్రీనివాస్, అశ్విన్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

శ్యాంలాల్ బిల్డింగ్‌లో బోరు మాయం

బేగంపేట, మే 20, ప్రభాతవార్త:

బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్‌లో ఎన్నో సంవత్సరాలుగా ఉన్న బోరును కొందరు మాయం చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో సంవత్సరాలుగా పరల్ అపార్ట్‌మెంట్‌కు వెళ్లేదారిలో కుడివైపు చేతిపంపు (బోరు) ఏర్పాటుచేసారు. అప్పట్లో ఇది బస్తీలో ఎవరైనాచనిపోతే ఈబోరువద్ద నుంచి నీటిని తీసుకెళ్లేవారు. ఇటీవల కాలంలో రోడ్డు ఆక్రమణలు తొలగించిన తరువాత కొందరు ఇక్కడ ఉండే బోరును మాయం చేసేసారు. దీంతో బస్తీవాసులు కొందరు కమ్యూనిటీ పోలీసు బేగం పేట గ్రూపులోసైతం బోరు తొలగించిన విషయాన్ని పోస్ట్‌చేసారు. సమీపంలోని షాపులవారు, నివాసాలవారు బోరును వినియోగించుకునేవారని, బోరును తొలగించడం ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. బోరును మాయంచేసిన వారిపై చర్యలు చేపట్టాలని వారు కోరారు. అయితే నీరు సమృద్ధిగా ఉన్న ఇలాంటి బోరును వినియోగంలోకి తీసుకురావాలని, తిరిగి చేతిపంపు బిగించేలా చూడాలని శ్యాంలాల్ బిల్డింగ్‌వాసులు కోరుతున్నారు.

సిసి రోడ్డును ప్రారంభించిన మాజీ కార్పొరేటర్

అల్వాల్, మే 20, ప్రభాతవార్త:

ప్రజావసరాలు మేరకు అభివృద్ధికి తన వంతు సహకారం ఉంటుందని మాజీ కార్పొరేటర్ జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. బుధవారం మచ్చబొల్లారం బ్లూబర్డ్స్ కాలనీలో నిర్మాణం పూర్తిచేసుకున్న సిసి రోడ్డును ప్రజానీకానికి అందుబాటులోకి తెచ్చారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సహకారంతో డివిజన్‌కు పూర్తి స్థాయిలో నిధులు మంజూరు అవుతున్నాయని జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. కాలనీవాసులు ఆయనను ఈసందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సురేందర్‌రెడ్డి, లడ్డురెడ్డి, శ్రీశైలం యాదవ్, వెంకటేష్‌గౌడ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

అల్వాల్, మే 20, ప్రభాతవార్త:

అర్హులందరికీ సిఎం రిలీఫ్‌ఫండ్ అందేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తన క్యాంప్ కార్యాలయంలో అల్వాల్, మచ్చబొల్లారం, వెంకటాపురం డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు ఆయన చెక్కులు అందించారు. సిఎం రిలీఫ్‌ఫండ్ అత్యవసర సమయంలో పేదలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్‌నేతలు అనీల్‌కిషోర్, జికె హనుమంతరావు, వెంకన్న, తోట నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి ప్రజల ఆక్రందనపై స్పందించిన గవర్నర్

కెపిహెచ్‌బి కాలనీ, మే 20, ప్రభాతవార్త:

స్వచ్ఛభారత్ అభియాన్ ఫౌండర్ చైర్మన్ మాధవరం కాంతారావు లోక్ భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాని కలిసి, కెపిహెచ్‌బి కాలనీ రోడ్ నెం.1 నుండి జేఎన్‌టీయూ వరకు ఉన్న సర్వీస్ రోడ్డులో తీవ్ర ఆక్రమణలు, భద్రతా సమస్యలపై వినతిపత్రం అందజేశారు. స్థానికంగా 350కి పైగా అక్రమ దుకాణాలవల్ల ఇక్కడిరోడ్లు ఇరుకుగామారి అత్యవసర వాహనాల రాకపోకలకు సైతం వీలులేకుండా పోయిందని, అలాగే స్థానికంగా వ్యాపారాలు చేస్తున్న వారి గుర్తింపుపై స్థానికుల్లో తీవ్ర భద్రతా ఆందోళనలు ఉన్నాయని కాంతారావు గవర్నర్‌కు వివరించారు. ఈ సమస్యపై ఇప్పటికే జిహెచ్ఎంసి, ట్రాఫిక్ పోలీస్, డిజిపికి కూడా పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఎలాంటి ఫలితం లేకపోవడంతోనే తాము గవర్నర్‌ని ఆశ్రయించాల్సి వచ్చిందని ఈసందర్భంగా ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, సంగారెడ్డి జిల్లా ప్రెసిడెంట్ జి.అంజిరెడ్డి, మేడ్చల్ రూరల్ జిల్లా ప్రెసిడెంట్ శ్రీనివాస్, కిసాన్ మోర్చా మాజీ ప్రెసిడెంట్ కళ్లెం బాల్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శంకర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ కృష్ణారెడ్డి ఇతర బీజేపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. దీనిపై గౌరవ గవర్నర్ శివప్రతాప్ శుక్లా సానుకూలంగా స్పందిస్తూ ప్రజల ఇబ్బందుల పట్ల ఆందోళన వ్యక్తంచేశారు.

గోవులను అక్రమరవాణా చేసేవారిని కఠినంగా శిక్షించాలి

-బిజెపి యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్‌యాదవ్

కెపిహెచ్‌బి కాలనీ, మే 20, ప్రభాతవార్త:

హిందువుల ఆరాధ్యదైవమైన గోవులను అక్రమంగా తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేస్తూ గోరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా బిజెపి యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్‌యాదవ్‌ను వారినివాసం దగ్గర జగద్గిరిగుట్ట పోలీస్‌లు అక్రమంగా అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా కుమార్‌యాదవ్ మాట్లాడుతూ గోవులను అక్రమరవాణా చేసేవారిని కఠినంగా శిక్షించాలని అన్నారు. మే16 శనివారంరాత్రి గోవులతో వెళ్తున్న లారీని గోరక్షక్‌దళ్ కార్యకర్తలు అడ్డుకున్నారని దీంతో ఎంఐఎం ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అక్కడకు చేరుకొని ఆలారీని తీసుకెళ్లడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. హిందువైనా ఎంఐఎం నాయకులైనా చట్టం ఒకే విధంగా ఉండాలని అన్నారు. గోవుల అక్రమరవాణా చేస్తూ బహిరంగంగా తిరుగుతున్న వారిపై వెంటనే కేసులు పెట్టాలని అన్నారు. గోమాతను కాపాడాలని చెప్పే ప్రభుత్వం అక్రమరవాణాను ఎందుకు ఆపడంలేదని హిందువుల తరుపున ప్రశ్నిస్తున్నా అన్నారు. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే వారిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. హిందువుల మనోభావాలను కాపాడాల్సిన బాధ్యతగల రాష్ట్ర ప్రభుత్వం ఒకే వర్గానికి కొమ్ముకాస్తూ వారి ఆగడాలను సమర్థించడం సరైనది కాదన్నారు.

గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రం

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం

చిన్నకోడూరు, మే 20, ప్రభాతవార్త : విద్యార్థులు, నిరుద్యోగ యువతి యువకులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం అన్నారు. చిన్నకోడూరులోని గ్రంథాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి పుస్తకాలను పరిసరా ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్య వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రంథాలయానికి కావాల్సిన పుస్తకాలు అందించడంతో పాటు సౌకర్యాలను కల్పించడానికి కృషి చేస్తానని తెలిపారు. గ్రంథాలయంలో ఎలాంటి సమస్య ఉన్న తన దృష్టికి తేవాలని పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కర్నే కన్నారెడ్డి, లైబ్రరీన్ కనకలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు సదాశివరెడ్డి, కోనేటి కరుణాకర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

50 శాతం సబ్సిడీపై జనుము విత్తనాల పంపిణీ

కొమురవెల్లి, మే 20, ప్రభాతవార్త : రైతులకు పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగపడే సన్‌హెంప్(జనుము) విత్తనాలను 50శాతం సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తుందని మండల వ్యవసాయ అధికారి వెంకట్రామమ్మ తెలిపారు. బుధవారం 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువు జనుము విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌తో మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద పర్మిట్ తీసుకొని ఆగ్రోస్ సెంటర్‌లో సబ్సిడీ విత్తనాలను తీసుకోవాలన్నారు. 40 కిలలో జనుము బ్యాగ్ ధర రూ. 3110 నిర్ణయించారని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మరిముచ్చాల క్లస్టర్ ఏఈవో భాస్కర్‌రెడ్డి, కొమురవెల్లి క్లస్టర్ ఏఈవో మురళి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బొచ్చు ఎల్లయ్యయాదవ్, ఆగ్రోస్ యజమాని కనకయ్య, ఆత్మకమిటీ డైరెక్టర్ చింతల పరుశరాములు, పాల్గొన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

జగదేవ్‌పూర్, మే 20 (ప్రభాతవార్త): మండల కేంద్రంలోని డిసిఎంఎస్ రైతు సేవాకేంద్రంలో బుధవారం ప్రభుత్వం అందిస్తున్న 50 శాతం రాయితీపై రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను గజ్వేల్ ఏఎంసి చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట ఎరువులను పంపిణీ చేస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.మండల వ్యవసాయాధికారి వసంతరావు మాట్లాడుతూ మండలానికి జనుము విత్తనాలు 70 క్వింటాళ్లు, జీలుగ 130 క్వింటాళ్లు కేటాయించగా ఇప్పటికే 70 క్వింటాళ్ల జనుము మండలంలో అందుబాటులో ఉందని, రెండుమూడు రోజుల్లో జీలుగ విత్తనాలు రైతులకు పంపిణీ చేస్తామన్నారు. జనుము 40 కేజీల బస్తా రూ.6,220కిగానూ 50 శాతం రాయితీపోగా 3,110 రైతులు చెల్లించాలని, అలాగే జీలుగ 30 కేజీల బస్తా ధర రూ.4,905 కాగా 50 శాతం రాయితీ పోగా రైతులు రూ.2,452.50 పైసలు చెల్లించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఏఈవో ఖలీల్, డిసిఎంఎస్ నిర్వాహకులు కిరణ్, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో...

హుస్నాబాద్ రూరల్, మే 20, ప్రభాతవార్త : మండలంలో రైతులకు పచ్చిరొట్ట ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి వేల్పుల పూజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హుస్నాబాద్ మండలంలోని అగ్రోస్ రైతు సేవా కేంద్రాలలో పచ్చిరొట్ట ఎరువులు 50 శాతం సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు పచ్చిరొట్ట పంటను వేయడం ద్వారా ఎకరానికి 10 టన్నుల పచ్చిరొట్ట ఎరువు లభిస్తుందని పేర్కొన్నారు. దీని ద్వారా భూమిలో 60 కిలోల నత్రజని, 15 కిలోల భాస్వరం, 50 కిలోల పొటాష్ చేరుతాయని వివరించారు. పచ్చిరొట్ట ఎరువుల వాడకంవల్ల నేల భౌతికస్థితి మెరుగుపడి, భూమి గుల్లగా మారి నీరు ఇంకే సామర్థం పెరుగుతుందని తెలిపారు. సేంద్రీయ పదార్థాలు పెరగడంవల్ల సూక్ష్మజీవుల వృద్ధి జరిగి జీవ రసాయణ చర్యల ద్వార భూసారం పెరుగుతుందన్నారు. అలాగే రసాయన ఎరువుల లభ్యత పెరగడంలో హరిత ఎరువులు సహకరిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఏఈవోలు శివరాం, స్వామి, రైతులు గుర్రాల సంజీవరెడ్డి, బంటు వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు

వడ్ల కొనుగోలు తీరును పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బెజ్జంకి, మే 20, ప్రభాతవార్త : ధాన్యం చివరి గింజ వరకు కాంగ్రెస్ సర్కార్ కొనుగోలు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఎఎంసి వైస్ చైర్మన్ చిలువేరి శ్రీనివాస్‌రెడ్డితోకలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్లను దిగుమతి చేసుకోవడంలో మిల్లర్లు జాప్యం చేయకూడదని చెప్పడం జరిగిందన్నారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్న ఘనత కాంగ్రెస్ సర్కార్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, డైరెక్టర్లు అక్కరవేణి పోచయ్య, ముక్కిస రత్నాకర్‌రెడ్డి, రావుల నర్సయ్య, బోనాల మల్లేశం, బోనగం రమేష్, ఐలేని శ్రీనివాస్‌రెడ్డి, రొడ్డ మల్లేశం, బైర సంతోష్, అయిలేని మహేందర్‌రెడ్డి, బోనగిరి శ్రీనివాస్, గుబిరే చంద్రం, గుండని ఎల్లయ్య, బోనగిరి రాజేందర్, కొంపల్లి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

'జనగణన'పై కళా ప్రదర్శన

మర్కుక్, మే 20 (ప్రభాతవార్త): మండల కేంద్రంలో జనగణన కార్యక్రమంపై ఏర్పాటుచేసిన కళాజాత కార్యక్రమాన్ని తహసీల్దార్ సరిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి రవికుమార్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కళాజాత కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. భారత జన గణన-2027 కార్యక్రమంలో జనాభా గణనలో పాల్గొని అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని, సామాజిక సంక్షేమం, ప్రాంతీయ అవసరాల గుర్తింపు, భవిష్యత్ ప్రణాళిక, కుటుంబసభ్యుల వివరాలు, నివాస పరిస్థితులను ఇంటి వద్దకు వచ్చే ఎన్యుమరేటర్లకు ప్రజలు తెలుపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బాలయ్య, సర్పంచ్ రాణి మల్లేశం, కళాకారులు పిల్లిట్ల శ్యాంసుందర్, సనువాల కనకయ్య, గంటె హరిప్రసాద్, తండ బిక్షపతి, పిస్నింటి రత్నం,పన్నీరు శ్రీనివాస్, ఎల్ల సిద్దులు, రాచపల్లి శైలజ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహసీల్దార్ సరిత

ప్రతి సమస్యను పరిష్కరిస్తాం: జిఎంఆర్

-బీరంగూడ, అమీన్‌పూర్ డివిజన్లలో ఎమ్మెల్యే జిఎంఆర్ పర్యటన

-త్వరలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

స్థానిక నాయకులతో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

అమీన్‌పూర్, మే 20, ప్రభాతవార్త:
అమీన్‌పూర్, బీరంగూడ డివిజన్ల పరిధిలోని ప్రతికాలనీని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. ప్రజలసమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. బుధవారం అమీన్‌పూర్, బీరంగూడ డివిజన్లపరిధిలోని తులసివనం కాలనీ, భ్రమరాంబికనగర్, ఎఆర్‌బృందావన్ కాలనీ, కెఎస్‌ఆర్ కాలనీ, అంజనాద్రి కాలనీ, టైలర్ కాలనీ, ఎన్ఎస్ఎల్ కాలనీ, ఎన్‌బిఆర్ కాలనీ, ఇక్రిశాట్ కాలనీలలో ఎమ్మెల్యే జిఎంఆర్ సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఈసందర్భంగా అమీన్‌పూర్ మున్సిపల్ మాజీచైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి, మాజీ వైస్‌చైర్మన్ నందారం నరసింహ గౌడ్, డిప్యూటీ కమిషనర్ ప్రదీప్‌కుమార్, వివిధ శాఖల అధికారులతోకలిసి కాలనీల్లో పర్యటించారు. ప్రజలు, కాలనీల సంక్షేమసంఘాల ప్రతినిధులతో నేరుగా సమావేశమై స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను నివేదిక రూపంలో అందించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులు కేటాయించి నిర్ణీత గడువులో పనులుపూర్తిచేస్తామని హామీనిచ్చారు. అమీన్‌పూర్ పరిధిలో ప్రతి ఇంటికి తాగునీరు అందించే దిశగా చర్యలు చేపట్టామని తెలిపారు. కొత్త కాలనీలకు కూడా నీటి సరఫరా కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. కాలనీలలో ప్రభుత్వ స్థలాలు, పార్కులు కబ్జాలకు గురికాకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా అదనపు సిబ్బందిని నియమిస్తున్నామని తెలిపారు. నూతన కాలనీలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ అవసరాలు అధికమవుతున్నాయని, ఇందుకు అనుగుణంగా కొత్త సబ్‌స్టేషన్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. త్వరలో బీరంగూడలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే స్వయంగా కాలనీలకు రావడంపట్ల కాలనీప్రతినిధులు, స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు బాలరాజు, కృష్ణ, యూనుస్, ఇంజనీరింగ్ విభాగం ఈఈ సురేష్, డిఈ వెంకటరమణ, జలమండలి డిఎం శివకుమార్, విద్యుత్‌శాఖ ఎడి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

వేద పాఠశాలలో దరఖాస్తుల స్వీకరణ

బర్దీపూర్‌లోని వేద పాఠశాలల దృశ్యం

ఝరాసంగం, మే 20, ప్రభాతవార్త:
మండలపరిధిలోని బర్దీపూర్‌గ్రామంలోని దత్తగిరి ఆశ్రమంలో నిర్వహిస్తున్న వేదపాఠశాలలో 2026-27 విద్యాసంవత్సరానికిగాను వేద విద్యను అందుకునేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆశ్రమ పీఠాధిప తులు వైర్యాగశిఖామణి అవధూతగిరి మహారాజ్, డాక్టర్ సిద్దేశ్వరానందగిరి మహారాజ్, ట్రస్ట్‌చైర్మన్ అల్లాడి వీరేశంగుప్తాలు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. వేదవిద్యను అందుకునేందుకు 5వ తరగతి ఉత్తీర్ణులై 9 ఏళ్ల వయసు నుంచి 14 సంవత్సరాల వయసుగల విద్యార్థులు అర్హులన్నారు. వేదవిద్యను అందుకునే విద్యార్థులకు ఉచితవిద్యతోపాటు ఉచితభోజనం, ఉచితవసతి సౌకర్యాలు ఉంటాయన్నారు. విద్యార్థులకు 6 సంవత్సరాలపాటు శిక్షణ అందచేస్తామన్నారు. ప్రవేశ, వర, ప్రవర కోర్సులు (అర్చక, పౌరోహిత్య, షోడశసంస్కారవిద్య) ద్వారా వేదాంతవిజ్ఞానం బోధిస్తామన్నారు. వేదవిద్యతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి వరకు విద్యను అభ్యసించేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్ విధానంలో కాకుండా ఆఫ్‌లైన్ విధానంలో మాత్రమే స్వీకరిస్తామని, పూర్తివివరాలకు బర్దీపూర్ ఆశ్రమ కార్యాలయాన్ని సంప్రతించాలని వివరాలకు 8639258008/9177259329లలో సంప్రతించాలన్నారు.

ముంగిలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త విజయ్‌కుమార్

న్యాల్‌కల్, మే 20, ప్రభాతవార్త:
మండల పరిదిలోని ముంగి రైతు వేదికలో బుధవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో చెరుకు సాగు అభివృద్ధి, చెరుకులో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మండలపరిధిలోని బసంత్‌పూర్ గ్రామంలోని వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ రైతులు పంటల సాగుకు ముందు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలన్నారు. నీటి యాజమాన్యం, కలుపు నివారణ, చీడపీడల నియంత్రణ, పంటకోత అనంతరం నిర్వహించాల్సిన అంశాలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ బిక్షపతి, మండల వ్యవసాయ అధికారి అభినాష్‌వర్మ, ఎఈఓలు సాయిలు, సన్నిధిరెడ్డి, సాయికిరణ్, మాధవి, రమేష్‌పాటిల్, సర్పంచ్ అరుణ శ్రీనివాస్‌రెడ్డి, ఆయాగ్రామాల సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో మందుల విక్రయాలను నియంత్రించాలి

-రాష్ట్ర ఫార్మాసిస్ట్ కమిటీ చైర్మన్ యెదిరె రమేష్

బంద్ నిర్వహిస్తున్న మెడికల్ అసోసియేషన్ సభ్యులు

జోగిపేట, మే 20, ప్రభాతవార్త:
ఆన్‌లైన్‌లో మందుల విక్రయాల్ని నిలిపివేయాలని, ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల విక్రయాలు సమంజసం కాదని రాష్ట్ర ఫార్మాసిస్ట్ కమిటీ చైర్మన్ యెదిరె రమేష్ డిమాండ్‌చేశారు. దేశవ్యాప్త మెడికల్‌షాపుల బంద్ నిర్వహణలో భాగంగా బుధవారం జోగిపేటలో మెడికల్‌షాపుల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్న మోసపూరితమైన మందుల విక్రయాలను అరికట్టాలనే ఉద్దేశంతోనే ఈబంద్ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జోగిపేట మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు రాచకొండ సాయిబాబ, కోశాధికారి శ్రీనివాస్‌లతోపాటు మెడికల్‌షాపుల యజమానులు పాల్గొన్నారు.

మొగుడంపల్లిలో రాత్రంతా అంధకారం

మొగుడంపల్లి, మే 20, ప్రభాతవార్త:
మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కురిసిన భారీవర్షానికి రాత్రంతా విద్యుత్‌సరఫరా నిలిపివేయడంతో రాత్రి ప్రజలు కంటిమీద కునుకు లేకుండా గడపాల్సివచ్చింది. బుధవారం 12గంటల వరకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించలేదంటే విద్యుత్ అధికారుల పనితీరుపై ప్రత్యేకంగా ప్రస్తావించాల్సిన పనిలేదు. విద్యుత్‌సరఫరా నిలిపివేస్తున్నప్పుడు అధికారులు ముందస్తుగా ప్రజలకు సమాచారం అందిస్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునే అవకాశాలు ఉంటాయని, అలాకాకుండా చెప్పాపెట్టకుండా విద్యుత్ సరఫరాను నిలిపేస్తే తమపరిస్థితి ఏమిటని మండలప్రజలు ప్రశ్నిస్తున్నారు. విద్యుత్‌సరఫరా లేక, బుధవారం ఉదయం తాగునీటి సరఫరా కాక పాట్లు పడాల్సివచ్చిందని మహిళలు ఆందోళన వ్యక్తంచేశారు.

టోర్నమెంట్ ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్

క్రీడలు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ నాగేష్ శెట్కార్

నారాయణఖేడ్, మే 20, ప్రభాతవార్త:
నారాయణఖేడ్ మండలంలోని మద్వార్ గ్రామంలో పెద్దల ఆహ్వానం మేరకు నిర్వహించిన క్రికెట్ ప్రీమియం టోర్నమెంట్‌ను మున్సిపల్ చైర్మన్ నాగేష్ శెట్కార్ ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులతో పరిచయం చేసుకుని, ఆటలో గెలుపోటములు సహజమని, వాటిని సవాలుగా తీసుకొని ప్రతిభ కనబరచాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో ఖేడ్ మండల్ యూత్‌కాంగ్రెస్ అధ్యక్షులు శివరాజ్, మద్వార్ సర్పంచ్ స్వరూప్‌సంజీవులు, లింగనాయక్‌పల్లి సర్పంచ్ లక్ష్మిభూమయ్య, మద్వార్‌తండా సర్పంచ్ సర్దార్, లింగాపూర్ సర్పంచ్ హనుమన్లు, అలాగే ఇడిగి రామగౌడ్, దుర్గయ్య, శంకర్, కృష్ణ, నాగయ్య, గ్రామ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేటు వద్దు-ప్రభుత్వ పాఠశాలలే ముద్దు

-బహిరన్‌దిబ్బలో బడిబాట

బడిబాటలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

అల్లాదుర్గం, మే 20, ప్రభాతవార్త:
మండలంలోని ముస్లాపూర్ గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ఉపాధ్యాయులు మండలపరిధిలోని బహిరన్‌దిబ్బలో బుధవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని విద్యార్థుల ఇళ్లకు చేరుకుని తమ చిన్నారులను ముస్తాపూర్‌లోని జడ్పిహెచ్ఎస్‌లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాల్లోనే విద్యను అందుకునేందుకు చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నభోజనం, యూనిఫాంలను అందచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్.రమేష్, బహిరన్‌దిబ్బ సర్పంచ్ పి.వీరప్ప, ఉపాధ్యాయులు జనార్దన్, సంతోష్, యాదయ్య, పంచాయతీ కార్యదర్శి స్వరూప, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

-జోనల్ కమిషనర్‌తో మాజీ కార్పొరేటర్ సింధూ వెన్నవరం

నారాయణ అమిత్‌కు వినతిపత్రం అందచేస్తున్న మాజీ కార్పొరేటర్

రామచంద్రాపురం, మే 20, ప్రభాతవార్త:
భారతీనగర్ డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని డివిజన్ మాజీ కార్పొరేటర్ వెన్నవరం సింధూ ఆదర్శరెడ్డి బుధవారం జోనల్ కమిషనర్ నారాయణ అమిత్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ సింధూ ఆదర్శరెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పనులను త్వరిగగతిన పూర్తిచేసేలా కాంట్రాక్టర్లను ఆదేశించాలని సూచించామన్నారు. డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ హామీ ఇచ్చినట్లు మాజీ కార్పొరేటర్ వెన్నవరం సింధూ ఆదర్శరెడ్డి వివరించారు.

రైతులకు అందుబాటులో పచ్చి రొట్ట విత్తనాలు

వెల్దుర్తి, మే 20, ప్రభాతవార్త:
మాసాయిపేట మండలం వ్యవసాయ రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా 50 సబ్సిడీతో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని బుధవారం మండల వ్యవసాయశాఖ అధికారిణి కవిత ఒక ప్రకటనలో తెలిపారు. 30 కిలోల బస్తాధర 2452.50 రూపాయలు చెల్లించి పొందాలన్నారు. రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, సెల్ నెంబర్, జిరాక్స్ కాపీలు తెచ్చి ఆన్లైన్లో పర్మిట్ చేసుకొని స్థానిక ఆగ్రోస్ కేంద్రాల్లో పొందాలని ఆమె సూచించారు. ఎకరానికి 12 నుండి 15 కిలోల విత్తనాలు సరిపోతాయన్నారు. 40 నుండి 45 రోజులలో నేలను మొత్తం కలియదున్నాలన్నారు. పచ్చి రొట్ట విత్తనాలు వాడకం ద్వారా నేల ఆరోగ్యం, నీటి నిల్వ సామర్థ్యం పెంపు, భూసారం పెంపుదల, నత్రజని, భాస్వరం, పొటాష్ సేంద్రియంగా నేలకు అందజేయబడుతుందన్నారు. కావున మండల రైతులు సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి

-సదాశిపేట మండల విద్యాధికారి ఎన్.శంకర్

బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

సదాశివపేట, మే 20, ప్రభాతవార్త:
మండల విద్యాధికారి ఎన్.శంకర్ ఆత్మకూర్ గ్రామంలో బుధవారం జరిగిన బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన తల్లిదండ్రుల నుద్దేశించి మాట్లాడుతూ ఆత్మకూరు గ్రామంలో అన్నిసౌకర్యాలు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని విజ్ఞప్తిచేశారు. మండల విద్యాధికారి శంకర్ ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల నమోదు కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించారు. గ్రామప్రజలకు ప్రభుత్వపాఠశాలల ప్రత్యేకతలను వివరించారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని, ప్రతి పిల్లవాడు బడిలోనే వుండాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులు కోటయ్య, ఉపాధ్యాయులు సందీప్, తాజోద్దీన్, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలి

-తహసీల్దార్‌కు వినతిపత్రం అందించిన బిజెపి నాయకులు

తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బిజెపి నాయకులు

నర్సాపూర్, మే 20, ప్రభాతవార్త:
నర్సాపూర్‌లోని ధాన్యం కొనుగోలుకేంద్రంతోపాటు మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో రవాణా సౌకర్యం లేక రైతులు ధాన్యం కుప్పలతో కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నందున కేంద్రాల్లో ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని బిజెపి నర్సాపూర్ శాఖ ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ శ్రీనివాస్‌కు ఒక వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు రఘువీర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ మన్నే నిరంజన్‌దాస్, పట్టణ అధ్యక్షులు చంద్రయ్య, జిల్లా ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి రాములునాయక్, జిల్లా కార్యదర్శి బాలరాజు, ఓబిసి మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు గుండం శంకర్, పట్టణ ప్రధాన కార్యదర్శులు బోర్‌వెల్ రామ్‌రెడ్డి, సంఘసాని రాజు, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రసాయనశాస్త్రంలో స్వరూపకు పిహెచ్‌డి

పటాన్‌చెరు, మే 20, ప్రభాతవార్త:
హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయనశాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని కేత స్వరూప డాక్టరేట్‌కు అర్హత సాధించారు. ఈపరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయనశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చిత్తలూరి సుధాకర్ బుధవారం ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ స్వరూప సిద్ధాంత వ్యాసం పిహెచ్‌డి పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డిఎస్ రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డివివిఎస్‌ఆర్‌వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయనశాస్త్ర విభాగాధిపతి డాక్టర గౌసియా బేగం, పలువిభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది స్వరూపను అభినందించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

చిన్నశంకరంపేట, మే 20, ప్రభాతవార్త:
కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ధర్తీ ఆబా జాతీయ గ్రామ ఉత్కర్ష్, పిఎం జనమాన్ పథకాలపై గ్రామీణప్రజలకు అవగాహన కల్పించేందుకు జన భాగీదారి-సబ్సే దూర్, సబ్సే పెహ్లే కార్యక్రమాన్ని బుధవారం కామారం తండాలో నిర్వహించినట్లు మండల ప్రత్యేకాధికారి వెంకటయ్య తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పిఎం జనమాన్ ద్వారా గిరిజన తండాలకు అందే పక్కా గృహాలు, స్వచ్ఛమైన త్రాగునీరు. రోడ్డు, విద్యుత్, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల గురించి వారికి వివరించారు. అర్హులైనవారు ఈపథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి మోహన్‌నాయక్, ఎంపిడివో దామోదర్, పంచాయతీ కార్యదర్శి స్వర్ణలత, ఉపసర్పంచ్ విజయ తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీపై అవగాహన అవసరం

చిన్నశంకరంపేట, మే 20, ప్రభాతవార్త:
దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను నివారించడానికి ఫిజియోథెరపీపై అవగాహన అవసరమని ఎంపిడివో దామోదర్ అన్నారు. బుధవారం చిన్నశంకరంపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ ఉద్యోగులకు ఫిజియోథెరపీపై అవగాహన కల్పించారు. భాగ్యనగరం నిజాం ఫిజియోథెరపిస్ట్ రమేష్ హజరై నరాలు, కీళ్లు, నడుము వంటి నొప్పులను తగ్గించే వ్యాయామాలపై అవగాహన కల్పించారు. పంచాయతీరాజ్ ఉద్యోగులు క్షేత్రస్థాయిలో నిరంతరం శారీరక శ్రమతో కూడిన విధులు నిర్వహించడం వల్ల వెన్నునొప్పి, మెడనొప్పి, కీళ్లనొప్పులు వంటి సమస్యల బారినపడే అవకాశం ఉన్నందున ఈ సమస్యలను నివారించడానికి ఫిజియోథెరపీ ఎంతో ఉపయోగపడుతుందని ఎంపిడివో దామోదర్ అన్నారు.

సమగ్ర సాగు యాజమాన్యంపై అవగాహన

రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కొల్చారం, మే 20, ప్రభాతవార్త:
కొల్చారం మండలపరిధిలోని తుక్కాపూర్‌గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజేంద్రనగర్, హైదరాబాద్‌కు చెందిన వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని రైతులకు పంటల సాగుపై పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు, ఉపసర్పంచ్ రవీందర్, వ్యవసాయ విస్తీర్ణ అధికారిణి రోజా, రైతులు పాల్గొన్నారు.

రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు

రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

కొల్చారం, మే 20, ప్రభాతవార్త:
కొల్చారం మండల పరిధిలోని యనగండ్ల గ్రామంలో నిర్వహించడం జరిగింది. వ్యవసాయ విశ్వావిద్యాలయానికి చెందిన రాజేంద్రనగర్ హైదరాబాద్ వారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ సురేష్ వివిధపంటల్లో తీసుకోవాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. రైతులు తమకున్న సందేహాలను నివృత్తి పరచుకోవడంతోపాటు, పంట మార్పిడి చేయడం తమకు ఇష్టమైనప్పటికీ, కోతులబెడద వల్ల కొంతవరకు ముందడుగు వేయలేకపోతున్నామని చెప్పడం జరిగింది. మొక్కజొన్న, జొన్న పొద్దుతిరుగుడు వంటి పంటలువేసిన రైతులు తమకు కొనుగోలుకేంద్రాలు కొంతవరకు దగ్గరలో ఉండేలాగా ఏర్పాటు చేయవలసిందిగా ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. కార్యక్రమంలో వ్యవసాయ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ సురేష్, సర్పంచ్ లక్ష్మీపెంటయ్య, ఉపసర్పంచ్ కొమ్ముల గోపాల్‌గౌడ్, పిఎసిఎస్ డైరెక్టర్ ఎల్.ప్రవీణ్‌రెడ్డి, ఎఫ్‌పిఒ చైర్మన్ రెడ్డి నర్సింహారెడ్డి, రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారిణి అంబిక పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో అందుబాటులో జీలుగ విత్తనాలు

-మండల వ్యవసాయ అధికారిణి దీపిక

నర్సాపూర్, మే 20, ప్రభాతవార్త:
నర్సాపూర్‌మండలంలో రైతులకు సరిపడా జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని నర్సాపూర్ మండల వ్యవసాయ అధికారిణి దీపిక తెలిపారు. ఈసందర్భంగా ఎఓ దీపిక మాట్లాడుతూ ఈ జీలుగు విత్తనాలు 30 కిలోల బస్తాకు 2452.50 రూపాయల ధర ఉంటుందని చెప్పారు. ఒక బస్తా జీలుగు విత్తనాలు రెండున్నర ఎకరాలకు సరిపోతుందని అన్నారు. జీలుగ విత్తనాలు అవసరమున్న రైతులు నర్సాపూర్‌లోని వ్యవసాయ అధికారి కార్యాలయానికి తమ ఆధార్ కార్డు పట్టాదార్ పాస్‌బుక్‌తో వచ్చి ఈ విత్తనాలని కొనుగోలు చేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి దీపిక తెలిపారు.

జీలుగు విత్తనాలు సద్వినియోగం చేసుకోండి

-మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్‌గౌడ్

చిలిపిచెడ్, మే 20, ప్రభాతవార్త:
చిలిపిచెడ్‌మండల పరిధిలోని సోమక్కపేట గ్రామాల్లో సహకారసంఘంలో పచ్చిరొట్ట ఎరువు జీలుగు విత్తనాల కౌంటర్‌ను మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్‌గౌడ్ ప్రారంభించారు. వర్షాకాలంలో భూములు సారవంతం అయ్యేలా చర్యలుచేపట్టాలని మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ సూచించారు. 50శాతం సబ్సిడీతో రాష్ట్ర ప్రభుత్వం జీలుగు విత్తనాలను 30కిలోల బస్తాకుగాను రూ.2452కు అందజేస్తుందని, ఒక బస్తా, ఒక హెక్టారుకు వస్తుందన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా జీలుగు విత్తనాలను 50శాతం సబ్సిడీపై పంపిణీచేయడం జరిగిందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఈవోలు అనిత, కృష్ణవేణి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తనయుడి జ్ఞాపకార్థం వైకుంఠరథం అందచేత

కొండాపూర్, మే 20, ప్రభాతవార్త:
తనయుడి జ్ఞాపకార్థం రూ.3లక్షల సొంత ఖర్చుతో గ్రామానికి వైకుంఠరథాన్ని అందజేసి మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి మానవత్వం చాటుకున్నారు. బుధవారం గుంతపల్లి గ్రామానికి వైకుంఠరథాన్ని అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ గుంతపల్లి గ్రామానికి చెందిన కలాల్ రామచందర్‌గౌడ్ తన తనయుడు నిఖిల్‌గౌడ్ జ్ఞాపకార్థం సొంతనిధులు ఖర్చుచేసి గ్రామ ప్రజల అత్యవసరాలకు చేయూతనివ్వడం మంచి పరిణామం అన్నారు. నిరుపేదగా పుట్టి, రైతుబిడ్డగా పదిమంది మేలుకోరే వ్యక్తిగా ఆయన ఆలోచనకు హర్షాన్ని వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో గుంతపల్లి కాంగ్రెస్ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై రైతుల ఆగ్రహం

-ఎమ్మార్వోకు బిజెపి వినతిపత్రం

తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బిజెపి నాయకులు

రామాయంపేట, మే 20, ప్రభాతవార్త:
రామాయంపేట మండలంలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టడంలో రాష్ట్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ బిజెపి మండల అధ్యక్షులు నవీన్ గౌడ్ అధ్యక్షతన బుధవారం ఎమ్మార్వోకు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ నెల రోజులుగా రైతులు కల్లాల్లో నిల్వ ఉంచిన ధాన్యం ఇప్పటికీ సగం కూడా కొనుగోలు కాకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. రామాయంపేట మండలంలోని అన్ని గ్రామాల్లో ఎటు చూసినా, ధాన్యం కుప్పలు కనిపిస్తున్నాయని, రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద రోజులతరబడి ఎదురుచూస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. నిన్న కురిసిన అకాలవర్షాల కారణంగా లక్ష్మాపూర్, పర్వతాపూర్, కాట్రియాల, దంతేపల్లి, కిషన్ తండా తదితర గ్రామాల్లో రైతుల ధాన్యం పూర్తిగా తడిసిపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అయినప్పటికీ అధికారులుగాని, ప్రజాప్రతినిధులుగాని గ్రామాలకు వెళ్లి రైతులను పరామర్శించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. గత 25రోజులుగా ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రహదారుల వెంట ఎటుచూసినా, ధాన్యం కుప్పలే కనిపిస్తున్నాయని అన్నారు. రైతులు రాత్రింబవళ్లు ధాన్యం కుప్పల పక్కనే కాపలాకాస్తూ, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే మెదక్‌నుంచి నిజాంపేటవరకు పర్యటించినప్పటికీ, ఒక్కరోజైనా రైతులవద్ద ఆగి వారి సమస్యలు తెలుసుకునే ప్రయత్నం చేయలేదని విమర్శించారు. మండలంలోని ధర్మారం, కోమటిపల్లి తదితరగ్రామాల్లో రైతులు రోడ్డెక్కి నిరసనలు తెలిపినా, ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. కేంద్రప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన నిధులు, బస్తాల కమిషన్లతో సహా అన్నీ అందిస్తున్నప్పటికీ, రాష్ట్రప్రభుత్వం కొనుగోళ్లు చేపట్టకపోవడం రైతాంగంపై నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే వెంటనే జోక్యం చేసుకుని మండలంలోని రైతుల ధాన్యం మొత్తం త్వరితగతిన కొనుగోలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. అలాగే వచ్చే పదిరోజుల్లో మండలంలోని మొత్తం ధాన్యం కొనుగోలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తిచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, కిసాన్ మోర్చా అధ్యక్షులు సంగయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు వెలుమల సిద్ధరాములు, మండల ఉపాధ్యక్షులు శ్యామలచారి, జిల్లా కార్యవర్గ సభ్యులు పోలీస్ దేవేందర్, ధర్మారం లక్ష్మణ్, బాలరాజు, సిద్ధరాములు, భానుప్రకాష్, సాయిచరణ్, రాజేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.